
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఆదివారం
11 జనవరి, 2026




# సంబరాల సంక్రాంతి

తారాతీరం

# దర్శకత్వంలోకి మాధురి దీక్షిత్?

## అప్పుడే కాదు..!

దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్ దర్శకురాలిగా మారనున్నట్లు సమాచారం. కాగా ఈ విషయం ఆమెను సంప్రదిస్తే తాను ప్రస్తుతం సిద్ధంగా లేనని ఆమె స్పష్టం చేశారు.



బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్‌ప్రస్తుతానికి దర్శకత్వం చేసే ఆలోచన లేదని, భవిష్యత్తులో బహుశా ప్రయత్నించవచ్చని వ్యాఖ్య. నాటి, నేటి సినిమా నిర్మాణంలో తేడాలను వివరించిన మాధురి అప్పట్లో సెట్లలో కనీస సౌకర్యాలు ఉండేవి కావని వెల్లడించారు. నటి మాధురి దీక్షిత్ తన దర్శకత్వ ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీకు 40 యేళ్ల అనుభవం ఉంది కదా, దర్శకత్వం వైపు వెళ్లే ఆలోచన ఉందా?" అని అడిగిన ప్రశ్నకు మాధురి బదులిస్తూ, "చాలా మంది నన్ను ఇదే అడుగుతారు. ఇన్నేళ్లలో ఎంతోమంది గొప్ప దర్శకులతో పనిచేశాను, వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. కానీ దర్శకత్వం అనేది నేను పూర్తిగా సిద్ధమయ్యాకే చేయాలి. ప్రస్తుతానికి నేను సిద్ధంగా లేను. బహుశా భవిష్యత్తులో ప్రయత్నిస్తానేమో!" అని తెలిపారు. ఈ సందర్భంగా తన తొలి చిత్రం 'అబోధ్' సమయం నుంచి ఇప్పటి సినిమా నిర్మాణంలో వచ్చిన మార్పులను ఆమె వివరించారు. అప్పట్లో యశ్ చోప్రా, ఆర్ చోప్రా, సుభాష్‌ఘయ్ వంటి ఐదారుగురు నిర్మాతలు మాత్రమే చాలా పద్ధతిగా ఉండేవారు. మిగతా వారి సినిమా నిర్మాణం అసంఘటితంగా సాగేది. కానీ ఈ రోజుల్లో ప్రతీది చాలా ఆర్గనైజ్డ్‌గా ఉంది అని ఆమె అన్నారు, పాత రోజులను గుర్తు చేసుకుంటూ. ఆ రోజుల్లో కనీసం మేకప్ వ్యాన్లు వంటి సౌకర్యాలు ఉండేవి కావు. షాట్ పూర్తయ్యాక ఎండలోనే గొడుగు కింద కూర్చోవాల్సి వచ్చేది. ఇప్పుడు నటులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పుడు పాత్రకు సిద్ధమవ్వడానికి ముందే స్క్రిప్ట్ ఇస్తున్నారు, రీడింగ్స్ జరుగుతున్నాయి. అప్పట్లో ఇవేమీ ఉండేవి కావు" అని మాధురి వివరించారు.

కొల్లి బాబీ చిత్రంలో

# చిరంజీవితో మోహన్‌లాల్





మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం "మన శంకర వరప్రసాద్ గారు" అనే సినిమాలో నటిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతుంది. ఇక దర్శకుడు బాబీ కొల్లి-చిరు కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' సంక్రాంతి విజేతగా నిలిచి బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించింది. ఈ చిత్ర కాన్సెప్ట్ పోస్టర్ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచింది.

ఈ సినిమాలో చిరంజీవితో పాటు మరో స్టార్ హీరో కీలక పాత్రలో నటిస్తారనే వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మొదట తమిళ హీరో కార్తీ పేరు వినిపించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ఆ పాత్రను పోషించబోతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ క్రేజీ కాంబినేషన్ కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇది చిరంజీవి కెరీర్‌లో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కానుంది. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానున్నట్లు సమాచారం.

ఆదివారం వార్త

11 జనవరి, 2026

## మంచి ముత్యాలు

– ఒక దేశం కీర్తి ప్రతిష్టలు ప్రధానంగా ఆ దేశ రచయితలపై ఆధారపడి ఉంటాయి. – శామ్యూల్ జాన్సన్

– పాఠకుడు కాకుండా రచయిత కాలేడు. – హేరీ గోల్డెన్

## కదంబం


'సంఘీ'భావం....5

కళ తప్పుతున్న సంక్రాంతి సంబరాలు

కవర్ స్టోరీ..6

సంబరాల సంక్రాంతి

ఈ వారం కవిత్వం.. 11

హృదయాకాశంలో..

యుగపురుషుడు.. స్వామి వివేకానంద..18

కథ..20

సరాగాలు

ఇంకా...

మొగ్గ

పుస్తక సమీక్ష

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..


# సమాచారం

## విదేశాల్లోని రోడ్లకు..

జాతిపిత మహాత్మాగాంధీ రోడ్డు/వీధి లేని ఊరు ఉందంటే అతిశయోక్తి కాదు. ఆయన అనుసరించిన అహింసా మార్గం ప్రపంచ దేశాలనూ ప్రభావితం చేసింది. అందుకే పలు దేశాలు ఆయన గౌరవార్థం తమ దేశాల్లో రహదారులకు గాంధీజీ పేరును పెట్టుకున్నాయి. దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్, యుఎస్ఏ, జర్మనీ, ఫిలిప్పీన్స్, కెనడా, ఇరాన్ మొదలైన దేశాల్లో మహాత్మాగాంధీ రోడ్ పేరుతో రహదారులున్నాయి.

స్వామి వివేకానంద 1893లో షికాగోలో చేసిన ప్రసంగం తెలియని వారుండరు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చినవారందరినీ ఆయన తన ఉత్తేజపూరిత ప్రసంగంతో మంత్రముగ్ధుల్ని చేశారు. అందుకే ఆయన గౌరవార్థం షికాగోలోని ఓ వీధికి 'స్వామి వివేకానంద వే' అని నామకరణం చేశారు.

రష్యాతో భారత్ స్నేహబంధం ఇప్పటిది కాదు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రష్యా(అప్పటి యూఎస్ఎస్ఆర్)లో ఎంతో పేరు ఉంది. అందుకే, ఆయన గౌరవార్థం మాస్కోలో ఓ స్మారకచిహ్నం ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతానికి జవహర్‌లాల్ నెహ్రూ స్క్వేర్ అని పేరు పెట్టారు. బాలీవుడ్ నటుడు, దర్శకుడు రాజ్‌కపూర్ విదేశాల్లోనూ పాపులర్. ముఖ్యంగా కెనడాలో ఆయనకు అభిమానులు చాలామంది ఉన్నారు. అందుకే ఒంటారియోలోని బ్రాంప్టన్ ప్రాంతంలో ఉన్న ఓ వీధికి 'రాజ్‌కపూర్ క్రెసెంట్' అని పేరు పెట్టారు. సైప్రస్‌లోని నికోసియాలో భారత హైకమిషన్ కార్యాలయం ఉంది. అక్కడి వీధికి భారత తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేరు పెట్టారు. టాంజానియాలోని దార్ ఇ సలాంలోనూ ఇందిరా గాంధీ పేరుతో ఓ వీధి ఉంది.

ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతానికి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆస్కార్ అవార్డు గెలుచుకున్న ఈ మ్యూజిక్ లెజెండ్ పేరును ఓ వీధికి పెట్టి కెనడా తన అభిమానాన్ని చాటుకుంది. ఒంటారియోలోని ఓ వీధికి 'అల్లా రఖా రెహమాన్' స్ట్రీట్‌గా నామకరణం చేసింది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

## చాక్లెట్ చిన్నదైంది

రూపాయి విలువ క్షీణించడానికి గల కారణాల గురించి వ్యాసం రాయమన్నారు, టీచర్.

"రూపాయి విలువ ఎందుకు క్షీణిస్తుందో కారణాలు నాకు తెలియదు. కానీ దీనివల్ల, నేను రెగ్యులర్‌గా తినే చాక్లెట్ సైజ్ తగ్గింది" అని సుబ్బారావు రాసి, దానిని క్లాస్‌లో వినిపించడంతో అంతా నవ్వారు.



## మరో కంపెనీలో

ఏజిఎమ్ వాడిగా.. వేడిగా జరుగుతోంది.

కంపెనీకి అధిక మొత్తంలో డబ్బు కావాలి, కానీ ఎలా? అన్నదే సమస్య?

చివరికి సుబ్బారావ్ ఒక బ్రహ్మాండమయిన ఉపాయం చెప్పాడు, అది అందరికీ నచ్చింది. అదేమిటంటే, ఈ అప్పుల పాలైన కంపెనీని మరొక కంపెనీలో కలపడమే.

## భార్యతో గొడవ..

ఒక ప్రముఖ చానెల్ వారు, తమ స్టాక్ మార్కెట్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడానికి ఇంటర్వ్యూలు చేస్తున్నారు.

ఇంటర్వ్యూలో పాల్గొనడానికి వచ్చినవారికి ఫోన్‌లో ప్రశ్న అడగడం, వీరు దానికి ఇచ్చే జవాబును బట్టి కావలసిన వ్యక్తిని సెలెక్ట్ చేసుకుంటారు.

చివరకు అప్పారావు సెలెక్ట్ అయ్యాడు, అతనిని అడిగిన ప్రశ్న ఏమిటంటే–

"ఫలానా కంపెనీ స్టాక్ పడిపోతుంది. ఏమి చేయాలో తోచడం లేదు?"

అప్పారావు జవాబు, "ఆ స్టాక్ భవిష్యత్‌లో పెరిగే ఛాన్స్ ఉందండి, మీకు ఏమీ తోచడం లేదంటున్నారు, అందువల్ల, మీ ఆవిడతో గొడవ పెట్టుకోండి"

– **లహరి**, కరీంనగర్

## ఫైట్

విలేకరి: "సార్, మీరు ఎంతో మందికి ఫైట్ సీన్‌లు చెప్పారు కదా!"

"ఔనన్నాడు" ఫైట్ మాస్టర్.

"మరి నిజ జీవితంలో ఓడిపోయారా?" అడిగాడు విలేకరి.

"ఔను.. ఓడిపోయాను" అన్నాడు.

"ఎవరితో ఓడిపోయారు?"

"కాంతం చేతిలో ఓడిపోయాను"

"కాంతం ఎవరు?"

"కాంతం నా భార్య"

## కొట్టినప్పుడు..

"ఏమండీ, మీ అమ్మగారితో చెప్పండి హఠాత్తుగా ఏడ్చి అందరినీ గాబరా పెట్టొద్దని".

"సరే. మరి అమ్మ ఎప్పుడు ఏడుస్తోంది?"

"నేను కొట్టడానికి వెళ్లినప్పుడు.."

## మంచి ముహూర్తం

"శుభ ముహూర్తం దాటిపోతోంది.. త్వరగా తాళి కట్టవయ్యా" అన్నాడు పురోహితుడు పెళ్లికొడుకుతో.

"తాళి కట్టిన తరువాత ఇక జీవితంలో శుభ ముహూర్తం ఉండదు కదండీ!"

## కుక్క కరిచినందువల్ల..

"మీ అత్తగారు ఎలా చనిపోయారు" అడిగింది అర్చన, స్నేహితురాలు వందనని.

"కుక్క కరిచినందువల్ల" బదులిచ్చింది వందన.




"అలాగా... అయితే నేను మీ కుక్కను రెండు రోజులు తీసుకెళ్ళవచ్చా?" అని అడిగింది.

## మతిమరుపుకు మందు..

"డాక్టర్! ఇతనికి మతిమరుపు వచ్చింది. అది త్వరగా నయమయ్యేలా మంచి మందులు ఇవ్వండి" అన్నాడు, పరాంకుశం.

"ఇతను మీకు ఏమవుతాడు?" అడిగాడు కామేశం.

"నా ఫ్రెండ్. నా దగ్గర పది వేలు అప్పు తీసుకున్నాడు. మళ్లీ అడిగితే మర్చిపోయాను అంటున్నాడు" అన్నాడు పరాంకుశం.

## సగం పండు

"మిమ్మల్ని సగం పండే తినమని చెప్పాను కదా, ఒక్కసారిగా షుగర్ ఇంతలా ఎలా పెరిగింది?" అడిగాడు డాక్టర్, పేషెంట్‌ను.




"నేను సగం పండే తిన్నాను డాక్టర్" అన్నాడు పేషెంటు.

"ఏం పండు తిన్నారు?"

"పనసపండు"

డాక్టర్ కింద పడిపోయాడు పేషెంటు సమాధానం విని.

– **ఈఎస్.మాధవన్**

## అమ్మాయి బాగుంటుంది

"ఈ హోటల్‌కి వచ్చినవాళ్లు మళ్లీ మళ్లీ వస్తుంటారు" అన్నాడు సర్వర్, కస్టమర్‌తో.

"మీ హోటల్‌లో ఫుడ్ అంత బాగుంటుందా?" అడిగాడు కస్టమర్.

"క్యాష్ కౌంటర్‌లో కూర్చునే అమ్మాయి అందంగా ఉంటుంది" బదులిచ్చాడు సర్వర్.

– **వైదా ఈశ్వరరావు**, విశాఖ

## 'సంఘీ' భావం



# కళ తప్పుతున్న సంక్రాంతి సంబరాలు

తెలుగు ప్రజల పెద్ద పండుగగా జరుపుకునే సంక్రాంతి వేడుకలు క్రమంగా మసక బారుతున్నాయి. సంక్రాంతి సాంప్రదాయాలు తగ్గుముఖం పడుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ పండుగ కేవలం పారువేట ఉత్సవాలకు మాత్రమే పరిమితం అవుతున్నాయి. మకర సంక్రాంతి పండుగ అందమైన ముగ్గులకు, గొబ్బెమ్మలకు, హరిదాసు పాటలకు, బసవన్నల ఆటలకు, నువ్వుల మిఠాయిలకు, గాలిపటాలు ఎగురవేయటానికి, మరెన్నో సంబరాలకు ప్రసిద్ధి చెందింది. గతంలో పెద్ద ఎత్తున కోడి పందేలు, ఎద్దుల పోటీలు ఆహ్లాదకర వాతావరణంలో జరుగుతుండేవి. అయితే ప్రస్తుతం కేవలం కోడి పందేలు మాత్రమే జరుగుతున్నాయి. అవి కూడా సంప్రదాయబద్ధంగా కాకుండా కమర్షియల్‌గా, ఒక జూదంగా రూపాంతరం పొందాయి. ఈ పండుగను పంటల పండుగ అని, మార్పు తెచ్చే పండుగ అని కూడా అంటారు. కష్టాల వ్యవసాయాన్ని నమ్ముకోవడం కంటే నగరాల్లో సాంకేతిక నైపుణ్యం పొంది నెలసరి వేతనాలతో కుటుంబాలను పోషించడమే మేలన్న భావన యువతలో కలుగుతోంది. దీనితో కేవలం పండుగ మూడు రోజులు మాత్రమే గ్రామాల్లో గడిపి హడావిడిగా నగరాలకు తరలివెళ్లిపోతున్నారు. దీనితో సంక్రాంతి సంబరాలు నామమాత్రంగా మారాయి. సంక్రాంతి అంటే సూర్యుడి చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో ఒక ముఖ్యమైన కదలిక, అంటే మార్పు ఉంటుంది. ఈ మార్పు మనం ఈ గ్రహాన్ని అనుభూతి చెందే విధానంలో ఒక కొత్త మార్పుని తీసుకువస్తుంది. ఒక సం॥లో ఎన్నో సంక్రాంతులు ఉంటాయి. వీటిలో ముఖ్యమైనవి రెండు. వాటిలో ఒకటి మకర సంక్రాంతి, రెండవది దీనికి సరిగ్గా ఆరు నెలల కాలంలో, వేసవి కాలపు ఆయనం తర్వాత వచ్చే కర్కాటక సంక్రాంతి. ఈ రెంటి మధ్య చాలా సంక్రాంతులు ఉన్నాయి. రాశి మారిన ప్రతిసారి దాన్ని సంక్రాంతి అనే అంటారు. ఎందుకంటే అది గ్రహగమనంలో మార్పుని సూచిస్తుంది. ఈ మార్పు కారణంగా మన జీవితాల పాలన, పోషణలు జరుగుతున్నాయని అర్థం చేసుకోవాలని సంక్రాంతి తెలియజేస్తుంది. ఈ కదలిక/మార్పు ఆగిపోతే మనం అనేది కూడా ఆగిపోతుంది. 22 డిసెంబరు రోజున శీతకాలపు ఆయనం వచ్చింది, అంటే సూర్యుని పరంగా చూస్తే ఈ గ్రహం వంపు గరిష్ట స్థాయికి చేరిందని అర్థం చేసుకోవాలి. ఈ రోజు నుంచి ఉత్తర గమనం చాలా బలంగా ఉంటుంది. భూమి మీద అన్నీ మారటం మొదలు పెడతాయి. మకర సంక్రాంతి నుంచి శీతాకాలం కొద్ది కొద్దిగా తగ్గుముఖం పడుతుంది. ఇది ఖగోళ శాస్త్రానికి చెందిన వాస్తవాలు అయితే మరోపక్క వ్యవసాయ రంగానికి చెందిన అంశాలు ఉన్నాయి.

మకర సంక్రాంతి పంటకోతల లేదా పంట నూర్పిడుల పండుగగా కూడా పేర్కొంటూ ఉంటారు. ఎందుకంటే ఈ సమయానికల్లా పంట నూర్పిడులు అయిపోయి, పంట ఇంటికి చేరుతుంది. ఈ రోజున, పంటలలో వారికి సహాయపడిన వారికి కృతజ్ఞత తెలుపుతారు. పంటలలో పశువులు చాలా పెద్ద పాత్ర పోషిస్తాయి. అందువల్ల పండుగ తరువాతి రోజు వాటి కోసమే, అదే కనుమ పండుగ అని పిలువబడుతుంది. మొదటి రోజు భూమికి, రెండవ రోజు మనకు, మూడవ రోజు పాడి పశువులకు కేటాయించారు. ఈ సమయంలో పశువులు మనకంటే ఉన్నత స్థాయిలో ఉంచబడ్డాయి. ఎందుకంటే వాటివల్లే మనం జీవిస్తూ ఉన్నాం, మన వల్ల అవి జీవించడంలేదు. మనం ఇక్కడ లేకపోతే అవన్నీ స్వతంత్రంగా, సంతోషంగా ఉంటాయి. కానీ అవి లేకపోతే మనం జీవించలేం.

ఈ పండుగలనేవి మన వర్తమాన, భవిష్యత్తులను స్పృహతో మలచుకోవాలి అనేదాన్ని గుర్తుచేస్తాయి. ఇప్పుడు మనం గత సంవత్సరపు పంటను కోసుకున్నాం. తరువాత పంటను సృష్టించడానికి కావలిసిన ప్రణాళికను స్పృహతో, జంతువులను కూడా పరిగణనలోకి తీసుకుని సిద్ధం చేయాలి. అందువల్ల ఈ మకర సంక్రాంతి పండుగ పంటల పండుగ అయ్యింది. భూమి సూర్యుని చుట్టూ 27 నక్షత్రాల లేదా 108 పాదాల పరిభ్రమణ పూర్తిచేసి, కొత్త ఆవృతాన్ని మొదలు పెట్టటాన్ని ఈ సంక్రాంతి తెలియజేస్తుంది.

మనం అనేదంతా ఈ గ్రహాన్నుంచి తీసుకున్నదేనని మనం గుర్తుచేసుకునే రోజు ఇది. ఇతర పండుగలతో పోలిస్తే సంక్రాంతి అనేక ప్రత్యేకతలు కలిగి ఉంది. ప్రధానంగా తెలుగు సాంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉంటుంది. దీనిని కాపాడుకునేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా గట్టి ప్రయత్నం చేయాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



కవర్ స్టోరీ

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# సంబరాల సంక్రాంతి

**హిందువులకు ప్రతి తిథి, రోజు, పౌర్ణమి, అమావాస్య అన్నీ పవిత్రమైనవే. పూజనీయమే. కారణం ప్రతి ఒక్కటి చరాచర సృష్టికర్త అయిన పరంధామునితో ముడిపడి ఉండటం. మనకి ప్రకృతి పరమేశ్వర స్వరూపం, గమనిస్తే హిందూ పర్వదినాలు ప్రకృతితో మమేకమై ఉండటం విశేషం. సంవత్సరంలో ఎన్నో విశేష రోజులు, పర్వదినాలు పంచాంగంలో కనిపిస్తాయి. అవన్నీ కూడా ప్రకృతిని ఆరాధించేవి.**

మనం జరుపుకొనే ముఖ్యమైన పర్వదినాలలో అత్యంత ముఖ్యమైనది సంక్రాంతి. మన దేశంలోని కొన్ని రాష్ట్రాలలో సంక్రాంతి కొత్త నెల మొదటి రోజుగా నిర్ణయించబడింది. ఆ రోజు నుండి వారి నూతన సంవత్సరం ఆరంభం అవుతుంది. ఇక్కడొక విశేషం గమనించాలి.

కొన్ని రాష్ట్రాలు సూర్యమానాన్ని, మరికొన్ని రాష్ట్రాలు చాంద్రమానాన్ని అనుసరిస్తాయి. అందువలన చాలా పర్వదినాల తేదీలు తిథులు ప్రతి సంవత్సరం మారుతుంటాయి. ఒకోసారి ఏ రోజున పండుగ జరుపుకోవాలి? అన్న సందేహం కూడా వస్తుంటుంది. కానీ ఒక్క సంక్రాంతి మాత్రమే ప్రతి సంవత్సరం జనవరి పద్నాలుగు లేదా పదిహేనవ తేదీన జరుపుకోవడం జరుగుతుంది. పర్వదినం వేళ అనుసరించే విధివిధానాలు ప్రాంతాన్ని బట్టి మారడం కనపడుతుంది. అవి స్థానిక ఆచారాల, ఆనవాయితీల అనుసరించి ఉంటాయి.

సంక్రాంతి అన్నదాతలైన రైతు సోదరుల పండుగ. ఆరుగాలం పుడమిని, ప్రకృతిని నమ్మి పడిన శ్రమకు ఫలితం ఏపుగా పెరిగిన పంటలు కల్లాల నుండి ఇంటికి చేరే సమయం. భూమిని నమ్ముకొన్న భూమి పుత్రులకు పండగ చేసుకోడానికి ఇంతకు మించిన ఆనంద సమయం ఏమి ఉంటుంది? సంక్రాంతి పర్వదినాలలో రైతులకు చేదుడువాదోడుగా ఉండే బసవన్నల కోలాహలం, పవిత్ర ధనుర్మాసంలో హరి సంకీర్తన చేస్తూ విచ్చేసే హరిదాసులు. సిరులతల్లి శ్రీ మహాలక్ష్మికి స్వాగతం పలుకుతూ వాకిలిలో తీర్చిదిద్దే అందమైన రంగవల్లులు. తీపి వంటకాలు, దూర ప్రాంతాల నుండి బంధుమిత్రుల రాక, పెద్ద పండుగకు అత్తారింటికి వచ్చే కొత్త అల్లుళ్ళ హడావుడి.. వెరసి గ్రామాలలో సంక్రాంతి పర్వదినాలు కోలాహలంగా ఉంటూ నూతన శోభను సంతరించు కొంటాయి.

మన పెద్దలు కూడా అన్ని వర్గాలు, వర్ణాల వారికి తగినట్లుగా సంక్రాంతి విధివిధానాలను రూపొందించారు.

సమాజంలోని ప్రతివొక్కరూ స్నేహభరిత వాతావరణంలో ఆనందోత్సవాలతో జరుపుకొనే సంక్రాంతి అంటే ఏమిటో వివరంగా తెలుసుకుందాం.

## పన్నెండు సంక్రాంతులు

హిందూ పంచాంగం ప్రకారం ప్రత్యక్ష నారాయణుడు శ్రీ సూర్యభగవానుడు నెలకు ఒక రాశి నుండి మరో రాశిలోకి సంక్రమిస్తారు. 'సంక్రమణం' అంటే 'చేరుట' అని అర్థం చెబుతారు.
కర్మసాక్షి ఆదిత్యుడు తన గమనంలో చేరిన గ్రహంతో కలిపి ఆ మాస సంక్రాంతి అని పిలుస్తారు. పన్నెండు సంక్రాంతులలో ఋతువుల మధ్యలో వచ్చేవి కూడా ఉన్నాయి. మేష సంక్రాంతి, తుల సంక్రాతి, మిథున సంక్రాంతి, ధను సంక్రాంతి, కర్కాటక సంక్రాంతి వీటిల్లో కొన్ని.

## మేష సంక్రాంతి

ప్రతి సంవత్సరం ఏప్రిల్ మధ్యలో వచ్చే ఈ సంక్రాంతి సమయంలోనే

తమిళనాడు, కర్ణాటక, మన తెలుగు రాష్ట్రాలు ఉగాది పండుగను జరుపుకొంటారు. విషు, కేరళ, పన సంక్రాంతి ఒడిశా, బిషూ, పంజాబ్ కూడా ఈ నెలలోనే వస్తాయి.

## మిథున సంక్రాంతి

భగ్గుమనే వేసవి నుండి ఉపశమనాన్ని ప్రసాదించేది 'తొలకరి'. మారిన వాతావరణ పరిస్థితులతో ఋతుపవనాల రాకతో చల్లని జల్లులు కురుస్తాయి. పులకరించిన పుడమి కొత్త పూలు పూయడానికి సిద్ధమవుతుంది. తొలకరి నూతన వ్యవసాయ పనులు మొదలు పెట్టడానికి అనువైన సమయం. ముఖ్యంగా ఒడిశాలో 'రజో పర్వ' పేరిట జూన్–జులై మధ్య కాలంలో మూడు రోజులు రైతులు భూమి పూజ చేసి దుక్కి దున్నుతారు.

## ధను సంక్రాంతి

శ్రీ మహావిష్ణుకు ప్రియమైన మార్గశిర మాసం చివర నుండి పుష్య మాస అంతర్గత మాసంగా వచ్చే ధనుర్మాసం శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీమన్నారాయణునికి ప్రీతికరమైనది. పన్నిద్దరు గాయక భక్తులైన ఆళ్వార్లలో ఒకే ఒక్క స్త్రీ 'గోదా దేవి'. ఈమెనే ఆండాళ్ అని కూడా పిలుస్తారు. పవిత్ర మాసంలో బాలిక ప్రతి నిత్యం శ్రీరంగనాథుని కీర్తిస్తూ ఒక గీతం ఆలపించేది. 'తిరుప్పావై'గా ప్రసిద్ధికెక్కిన ముప్పై పాశుర గానంతో తిరుమలలో సహ అన్ని ఆలయాలలో శ్రీహరికి ధనుర్మాసంలో మేలుకొలుపు పలుకుతారు. ధను సంక్రాంతి రోజునే ధనుర్మాసం ప్రారంభం అవుతుంది. ఈ రోజున వైకుంఠ వాసుని పూజించడం మోక్షదాయకం అంటారు. ఈ మాసంలో శ్రీ మహావిష్ణువు లాంటి భర్త లభించాలని కన్నె పిల్లలు ధనుర్మాస వ్రతం చేపడతారు. పాశుర గానం చేస్తారు. భోగి పండుగ నాడు జరిగే శ్రీ గోదా కల్యాణంలో పాల్గొంటారు.

## కర్కాటక సంక్రాంతి

రవి కర్కాటక రాశిలో చేరడం వలన కర్కాటక సంక్రాంతిగా పిలవబడుతోంది. కర్కాటక మాసంలోనే కేరళీయులు గతించిన వంశ పెద్దలకు తిల తర్పణాలు వదులుతారు. పవిత్ర పుష్కరిణి, నదీ, సముద్ర తీరాలలో ఈ కర్మకాండ నిర్వర్తిస్తారు. ఇది మన దగ్గర మహాలయ పక్షాలలో చేసే పితృకార్యాల లాంటిదే. ఆ విధంగా మనకు మొత్తంగా పన్నెండు సంక్రాంతులు ఉన్నాయి. ఏ సంక్రాంతి ప్రత్యేకత ఆ సంక్రాంతిదే. కానీ వాటిలో ముఖ్యమైనది దివాకరుడు మకర రాశికి చేరిన సమయంలో వచ్చే 'మకర సంక్రాంతి' లేదా 'మకర సంక్రమణం'. మన పెద్దలు సంవత్సర కాలాన్ని రకరకాలుగా విభజించారు. మొదట పన్నెండు నెలలను రెండు భాగాలూ చేసారు. ఉత్తరాయనం, దక్షిణాయనం. కర్కాటక, సింహ, కన్య, తుల, వృశ్చిక, ధను రాశులతో కూడిన కాలాన్ని దక్షిణాయనం అంటారు. ఈ సమయం బ్రహ్మచర్యం, యోగ, ధ్యాన, దీక్షలకు, పూజలకు అనువైనది. మకర, కుంభ, మీన, మేష, వృషభ, మిథున రాశులలో



దినకరుడు చేరిన ఆరు నెలల కాలాన్ని ఉత్తరాయనం అని పిలుస్తారు. పురాతన గ్రంథాలలో మన ఒక సంవత్సరం లోకాలను పాలించే దేవతలకు ఒక రోజు. ఉత్తరాయన కాలం ఒక పగలు, దక్షిణాయన కాలం ఒక రాత్రిగా పేర్కొనబడినది. వేల్పులు మేలుకొని ఉండే ఉత్తరాయణం పుణ్య కాలం కెవానుగ్రహాన్ని ప్రసాదించేది. మోక్షదాయకం అని చెబుతారు. సంక్రాంతి పండుగలో మరొక ప్రత్యేకత కనిపిస్తుంది. మిగిలిన పండుగలు తిథి ప్రకారం నిర్ణయించబడతాయి. ఎప్పుడూ ఒకే తేదీన రావు, కానీ మకర సంక్రాంతి మాత్రం జనవరి నెలలో పధ్నాలుగు, పదిహేను తేదీలలోనే వస్తుంది.

## అనేక పేర్లు – ఎన్నో ప్రత్యేకతలు

కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు భారతదేశ ప్రజలు అంతా పొంగల్‌ని జరుపుకొన్నప్పటికీ, సంక్రాంతి దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో పెద్ద పండుగగా ప్రసిద్ధి. దేశంలోని అన్ని ప్రాంతాలలో సుమారు ఒకే విధమైన ఆచార వ్యవహారాలతో జరుపుకున్నా ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. తమిళనాడులో 'పొంగల్' అని పిలుస్తారు. తమిళులకు పొంగల్ పెద్ద పండుగ. తెలుగు వారిలాగానే తమిళనాడు ప్రజలు కూడా సంక్రాంతిని విశేషంగా జరుపుతారు. ముఖ్యంగా గ్రామాలలో పొంగల్‌శోభ అద్భుతంగా ఉంటుంది. తమిళనాడులో దీపావళి, ఉగాది తరువాత అందరూ కలిసి మెలిసి నాలుగు రోజుల పాటు సంక్రాంతి జరుపుకొంటారు.

## భోగి

మార్గశిర మాసం ఆఖరి రోజున జరుపుకొనే భోగి పండుగ ముందురోజు పల్లెలలో ఇండ్లను 'కప్పు కట్టు' పేరిట చేప, తంగేడు, కొండపిండి ఆకులు, పూలతో అలంకరిస్తారు. అలా చేయడం వలన అనారోగ్యాన్ని కలిగించే శక్తులు అడుగు పెట్టలేవన్నది వారి విశ్వాసం, తెల్లవారుజామున ఇంటి ముందు భోగిమంట వెలిగిస్తారు. గతానికి వీడ్కోలుగా పాత, విరిగిన, పనికిరాని చెక్కవస్తువులు, ఇతర సామగ్రి భోగి మంటలో వేస్తారు. రంగు రంగుల రంగవల్లులను తీర్చిదిద్దుతారు. రంగులు వేసిన కుండలను, చెఱుకు గడలతో ప్రవేశద్వారాన్ని సుందరంగా అలంకరిస్తారు.



సకాలంలో వర్షాలు కురిపించి చక్కని పంట పండేలా ఆశీర్వదించిన ఇంద్రుని ఆరాధిస్తారు. నువ్వులు, బెల్లం, బియ్యం, పాలతో చేసిన తీపి పదార్థాలను అందరికి పంచుతారు.

## తాయ్ పొంగల్

సూర్యోదయానికి ముందే నిద్రలేచి, నదీ స్నానం చేసి, ఇష్ట/గ్రామదేవత పూజలు చేస్తారు. కొత్త కుండలో పాలు పొంగించి, పాయసం తయారు చేస్తారు. ఆ పాయసాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ప్రసాదంలా స్వీకరించి, నూతన వస్త్రాలు ధరించి ఆలయ సందర్శనం చేస్తారు.

**మాట్టు పొంగల్:** పొంగల్ సంబరాలలో మూడవ రోజైన మాట్టు పొంగల్‌ను పూర్తిగా తమకు చేదోడు వాదోడుగా ఉన్న పశువులకు కేటాయిస్తారు. పొంగల్ అంటేనే వ్యవసాయదారుల పండుగ. చక్కగా రకరకాల పూలు, పూసల మాలలతో ఎద్దులను అలంకరిస్తారు. కొమ్ములకు, గిట్టలకు రంగులు వేస్తారు. చెఱకు, బెల్లంతో పాయసం పెడతారు. కొన్ని గ్రామాలలో జల్లికట్టు, కోడిపందేలు నిర్వహిస్తారు.

**కనుమ్ పొంగల్:** ఈరోజు గౌరవ సూచకంగా ఇంటి పెద్దలకు నూతన వస్త్రాలు సమర్పించి, ఆశీర్వాదం తీసుకుంటారు. బంధుమిత్రులను కలవడం భవిష్యత్తులో కూడా వారి నుండి సహాయ సహకారాలు పొందడం, అందివ్వడం లాంటి వాగ్దానాలు తీసుకుంటారు.

## మకర విళక్కు

భిన్న ఆచారాల, పద్ధతుల, ప్రత్యేక ఆలయాల దేవతల సస్యస్థలం అయిన కేరళలో మకర సంక్రాంతిని "మకర విళక్కు' అంటారు. సూర్యుదయానికి ముందే నిద్రలేచి స్నానాదులు పూర్తి చేసుకొంటారు. ప్రతి ఇల్లు, ఆలయాలు పూలతో, పూల రంగవల్లులతో రమణీయంగా అలంకరిస్తారు. కులదేవత పూజలు, ఆలయ సందర్శనతో పాటు ఇంటి పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. పాలపాయసం ప్రసాదంలా స్వీకరిస్తారు. కుటుంబ సభ్యులు కలిసి భోజనం చేస్తారు. సాయం సంధ్యా సమయంలో వేసిన పూలముగ్గు మధ్యలో నేతితో జ్యోతి వెలిగిస్తారు. ఇంటిని విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. అన్ని హిందూ దేవాలయాలు దీపకాంతులతో దేదీప్యమానంగా దర్శనమిస్తాయి. శబరిమల కొండలలో మకర విళక్కు దర్శనతో దీక్షాధారులు ఆనందంతో 'స్వామియే శరణం అయ్యప్ప' అన్న శరణ ఘోషతో స్వామిని కీర్తిస్తారు.

## సుగ్గి

రైతన్నల పండుగైన సంక్రాంతిని కర్ణాటక రాష్ట్రంలో "సుగ్గి' పేరిట ఆహ్లాదకర వాతావరణంలో మూడు రోజులు జరుపుకొంటారు. సుందరంగా తీర్చిదిద్దిన రంగవల్లుతో ప్రతి లోగిలి సంతోషానికి నిదర్శనంగా కనిపిస్తాయి. పల్లెలలో నూతన వస్త్రాలు ధరించిన ఆడపిల్లలు తమ కుటుంబ పెద్దలకు, తోడబుట్టినవారికి, స్నేహితురాళ్లకు, నువ్వుండలు, పల్లీలతో చేసిన తీపి పదార్థాలు, రేగిపండ్లను ఇస్తారు. ఆలయ సందర్శనం తప్పనిసరి. తొలి రెండు రోజులు చక్కని పంట చేతికి వచ్చిన ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకొంటారు. మూడవ రోజున వ్యవసాయంలో సహాయం చేసిన వృషభాలను సుందరంగా ఆలంకరించి దృష్టిదోషం పోవడానికి నిప్పులు దాటిస్తారు.

ఉత్తర భారతదేశంలో సంక్రాంతిని రాష్ట్రానికి ఒక పేరు చొప్పున జరుపుకుంటారు. సంక్రాంతి రైతులకు సంబంధించిన పండుగ, సూర్యభగవానుని గమనం వల్ల ఏర్పడిన శుభదినం కనుక నది/సముద్ర స్నానం, సూర్యునికి అర్ఘ్యం సమర్పించడం తప్పనిసరి. చెఱకు, ధాన్యం పంటలు పండే కాలం అయినందువల్ల బెల్లంతో తీపి పదార్థాలు, పాయసం లాంటివి తయారు చేస్తారు. అందరితో కలిసి పంచుకుంటారు. పశువులను అలంకరించడం, పూజించడం కూడా కనపడుతుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో కనిపించే మరో ముఖ్యమైన సరదా గాలిపటాలు ఎగురవేయడం. రంగు కాగితాలతో రకరకాలుగా చేసిన గాలిపటాలను ఎగురవేయడం, పందేలు కాయడం తరతరాల నుండి వస్తున్న ఆనవాయితి. ముఖ్యంగా గుజరాత్‌లో గాలిపటాల పోటీ నిర్వహిస్తారు. దేశ విదేశాల నుండి ఔత్సాహికులు పాల్గొంటారు. మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీలో కూడా సంక్రాంతి పర్వదిన సందర్భంగా గాలిపటాల పోటీలను నిర్వహిస్తారు.

## ఉత్తరాది సంక్రాంతి

ఉత్తరాయణ్, సంక్రాంత్, మకర, శక్రాత్, బిహు, మాఘి లేక కిచేరి.. పేరు ఏదైనా అన్ని ఉత్తరాది రాష్ట్రాలలో సంక్రాంతి సంబరాలను దరిదాపుగా ఒకే విధానంలో జరుపుకోవడం విశేషం. ప్రతి లోగిలి రమ్యంగా తీర్చిదిద్దిన రంగవల్లులతో శోభాయమానంగా దర్శనమిస్తుంది. అవకాశం ఉన్నవారు పవిత్ర నదులలో, సముద్రంలో కుటుంబంతో కలిసి పవిత్ర స్నానాలు చేస్తారు. సమీపంలోని దేవాలయాలలో పూజాదికాలు నిర్వహిస్తారు. పురోహితులకు, పెద్దలకు నూతన వస్త్రాలు అందిస్తారు, దానధర్మాలు చేస్తారు.

కుదరనివారు ఉదయాన్నే స్నానాదులు చేసి ప్రత్యక్ష నారాయణునికి అర్ఘ్యం అందించి, గృహంలో శ్రీ మహాలక్ష్మి సమేత శ్రీ మహావిష్ణువును ఆరాధించి నువ్వులతో చేసిన మిఠాయిలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో స్వీకరించడం సంక్రాంతి ఆరంభం అవుతుంది.

సాయంత్రం పిల్లలు, పెద్దలు వివిధ రకాలుగా తయారు చేసిన గాలిపటాలను ఎగురవేస్తారు. మిఠాయిలు పంచుకుంటారు. గతానుభవాలను నెమరు వేసుకుంటారు పెద్దలు. రాత్రికి గ్రామస్థులు భోగిమంట చుట్టూ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తారు.



### మన సంక్రాంతి

తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగతో చెప్పలేని, ఎనలేని తరతరాల బంధం పెనవేసుకొని ఉన్నది. పెద్ద పండుగకు చాలా ముందే పిల్లలు, పెద్దలు రకరకాల ఆలోచనలతో సిద్ధం అవుతుంటారు. దూర ప్రాంతాలలో స్థిరపడినవారు పండుగను స్వగ్రామంలో బంధు మిత్రులతో కలిసి చేసుకోవాలన్న ఆకాంక్షతో ఏర్పాటు చేసుకుంటారు. ప్రకృతి ఆశీర్వాదంతో పండిన పంటలు ఇంటికి చేరిన ఆనందంలో రైతన్న కుటుంబ బంధుమిత్రులను ఆహ్వానిస్తారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు పండుగను ఆనందంగా చేసుకుంటారు.

### ముగ్గులు

శ్రీమన్నారాయణునికి ప్రీతికరమైన మార్గశి/ధనుర్మా సాలలో ప్రతి ఇంటి ముందు రకరకాల ముగ్గులు వేయడం హిందూ సంప్రదాయం. పండుగ సమయంలోనే కాదు విడిగా కూడా నిత్యం ఇంటి ముందు ముగ్గులు వేస్తారు. అసలు ముగ్గు ఎందుకు వేయాలి అన్నదానికి పెద్దలు ఎన్నో సమాధానాలు చెప్పారు. రంగోలి అనే సంస్కృత పదం పదం నుండి వచ్చినదే రంగవల్లి. ముగ్గులో వాడే బియ్యపుపిండి పక్షులకు, క్రిమికీటకాదులకు ఆహారం, భూతదయ కలిగినవారు భగవంతునికి వంగి ముగ్గులు వేయటం వల్ల శారీరక వ్యాయామంతో పాటు వేస్తున్న రంగవల్లి మీద ఏకాగ్రత కలిగి ఉండటం వల్ల మానసిక స్థిరత్వం ఏర్పడుతుంది.

**సంక్రాంతి ముగ్గులతో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి.** ధనుర్మాసంలో రకరకాల ముగ్గులు వేసినా భోగి, సంక్రాంతి, కనుమ రోజులలో నిర్ణయించిన వాటిని వేయడం సంప్రదాయం. భోగి, సంక్రాంతి రోజులలో చెరుకుగడలు, కలశం, పుష్పాలతో కూడిన ముగ్గును పండగ ప్రత్యేకతను తెలిపే విధంగా వేస్తారు. మా కుటుంబం, గ్రామం, దేశం అందరం సురక్షితంగా, సుభిక్షంగా ఉండాలి అన్నదానికి పూర్ణకలశం నిదర్శనంగా భావించాలి. కనుమనాడు వేసే రథం ముగ్గు ఆనందంగా గడిపిన పండుగరోజులు తిరిగి రావాలి, అందరం ఇలానే కలిసి మెలిసి ఆనందంగా ఉండాలి అన్నదానికి సంకేతం. రథానికి వేసిన దారంతో పక్కన ఉన్న ముగ్గులను కలిపేది ఇందుకే.

### గొబ్బెమ్మలు

ధనుర్మాసంలో శ్రీ లక్ష్మీనారాయణులకు స్వాగతం పలికేందుకు తీర్చిదిద్దిన ముగ్గులలో పచ్చటి గుమ్మడి పూలతో అలంకరించిన గొబ్బెమ్మలను ఉంచుతారు ఆడపిల్లలు. పెద్దలు గొబ్బెమ్మలను భక్తికి నిదర్శనంగా పేర్కొంటారు. శ్రీ రంగనాథుని మీద అనురాగంతో పాశురాలు పాడిన గోదా దేవితో తమను తాము ఊహించుకుంటూ సాయంసంధ్యా సమయంలో చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతారు. చుట్టూ ఉన్న చిన్న గొబ్బెమ్మలు గోపికలు, మధ్యలో ఉన్న పెద్ద గొబ్బెమ్మ గోదాదేవిగా భావించి పూజిస్తారు. నెల రోజుల పాటు పెట్టిన గొబ్బెమ్మలను ఎండబెట్టి రథ సప్తమి నాడు ఆ పిడకల మీద పాలు పొంగించి పాయసం చేయడం అనే సంప్రదాయం తెలుగు రాష్ట్రాలలో అనేక చోట్ల కనిపిస్తుంది. సంక్రాంతి, రథ సప్తమి రెండూ శ్రీ సూర్య భగవానుని ఆరాధించే పండుగలు కావడం ఇక్కడ విశేషం.

### బొమ్మల కొలువు

సంక్రాంతికి బొమ్మల కొలువు పెట్టడం తెలుగు ప్రజల సంప్రదాయం. బొమ్మల కొలువు నేర్పరితనంతో పాటు ఆనందాన్ని, సంతృప్తిని, సాంస్కృతిక సంప్రదాయ ఆధ్యాత్మిక విలువలను పెంపొందిస్తుంది. తొమ్మిది మెట్ల మీద దేవీ దేవతలు, సాంస్కృతిక చిహ్నాలకు నిదర్శనంగా కళ్యాణం బొమ్మలు, కిరాణం దుకాణం, నేటి సంఘంలోని పాత్రలు, ప్రాపంచిక విషయాలకు చెందినవి. మలదిన వారి పనితనాన్ని తెలుపుతూ విస్మయపరిచే చిత్రమైన బొమ్మలు, జీవం ఉట్టి పడే జంతువుల బొమ్మలు చక్కగా ఒక వరుస క్రమంలో అమరుస్తారు. కొలువు పైభాగాన కలశం, శ్రీ దుర్గాదేవి విగ్రహాన్ని ఉంచుతారు.

మూడు రోజులు దీపారాధన, నివేదన చెయ్యడం జరుగుతుంది. కన్నెపిల్లలు, ముత్తైదువులను ఆహ్వానించి పసుపు కుంకుమ తాంబూలం ఇచ్చి ఆశీర్వాదం పొందటం మన సంస్కృతిలో భాగం. తెలుగు ప్రజలు సంక్రాంతిని పూర్తిగా భిన్నంగా ప్రత్యేకతతో జరుపుకొంటారు.

### గంగిరెద్దులు

సుందరంగా రకరకాల వస్త్రాలతో అలంకరించిన వృషభరాజులను తీసుకొని వచ్చి, మేళతాళలతో పాటలు పాడుతూ ఇండ్ల ముందు ఆటలు ఆడించడం సంక్రాంతి సందర్భంగా కనిపించే మరో ప్రధాన విశేషం. వందల సంవత్సరాల చరిత్ర ఈ గంగిరెద్దులాటలకు ఉన్నది.

అనేక కావ్యాలలోనూ ఉదహరించబడింది. గృహ యజమాని గొప్పదనాన్ని, దాన గుణాన్ని పొగుడుతూ బృంద నాయకుడు చేసే గానానికి సమ్మతి తెలుపుతున్నట్లుగా తల ఊపుతూ గంగిరెద్దులు చేసే నృత్యం చూడచక్కగా ఉంటుంది.

## హరిదాసులు

‘హరిలో రంగ హరి’ అని ధనుర్మాసం మొదలైన దగ్గర నుండి సంక్రాంతి వరకు హరికీర్తనలు పాడుతూ ఇంటింటికి వచ్చే హరిదాసుల ప్రస్థావన తప్పనిసరి. సంవత్సరమంతా కనిపించని ఈ విష్ణుభక్తులు ఈ నెల రోజులు మాత్రమే కనిపిస్తారు. శిరస్సున అక్షయపాత్ర చేతిలో చిరుతలు, కళ్ళకు గజ్జెలు, నుదిటిన నామం, భుజాన తుంబుర, శ్రీహరిని పోలిన వస్త్రధారణ, మేడలో పూమాల వెరసి సంక్రాంతి రోజులలో వేకువనే రమ్యంగా శ్రీహరి కీర్తనలు పాడుతూ దర్శనమిచ్చే హరిదాసు రాక శుభసూచకంగా భావిస్తారు.

## భోగి

మకర సంక్రాంతి సంబరాలలో మొదటి రోజైన భోగినాడు తెల్లవారుజామున సాంప్రదాయ విధానంలో తమ ప్రాంతంలో లేదా నాలుగు దారుల కూడలిలో భోగి మంట వెలిగిస్తారు. పిల్లా పెద్ద ఉత్సాహంగా పాత చెక్కసామాన్లు, కట్టెలు చివరికి మూలనున్న చీపుర్లను కూడా మంటలో వేసి ధనుర్మాస చలిని పూర్తిగా ఆస్వాదిస్తారు. చాలాచోట్ల భోగి స్నానం చేయడానికి కావలసిన నీటిని కూడా ఈ మంటలలోనే కాచుకోవడం విశేషం. ప్రతి ఇంటి ముందు చక్కగా రంగవల్లులు మధ్యలో గొబ్బెమ్మలను సుందరంగా తీర్చిదిద్ది ఒక క్రమంలో పెడతారు. పూజాదికాలు నిర్వహించి, తీపి పదార్థాలను అందరితో పంచుకొంటారు. గతంలో గ్రామాలలో కోళ్ల పందేలు నిర్వహిస్తారు.

**భోగి పండ్లు:** భోగినాటి సాయంత్రం ముత్తైదువలను పేరంటానికి పిలిచి వారి సమక్షంలో చిన్న పిల్లలకు పిల్లలకు భోగి పండ్లు పోయడం ఒక ఆచారం. రేగి పండ్లు, శనగలు, పువ్వులు, చిల్లర పైసలు కలిపి భోగి పండ్లను తయారు చేస్తారు. భోగి పండ్లు పోయడం ద్వారా పిల్లలకు దృష్టిదోషం, చెడు పీడల ప్రభావం పడదని విశ్వసిస్తారు. పెద్దల ఆశీర్వాదాలతో వారి జీవితం బాగుంటుంది అని నమ్ముతారు. పిల్లలను తివాచీ మీద కూర్చోబెట్టి, నుదుట కుంకుమ దిద్దుతారు. పేరంటానికి వచ్చిన పెద్ద ముత్తైదువులు భోగి పండ్లను గుప్పెటలోకి తీసుకొని రెండు సార్లు సవ్య దిశలో, మూడోసారి అపసవ్య దిశలో పిల్లల చుట్టూ తిప్పి తలా మీద పోస్తారు. ముత్తైదువలు మంగళహారతి ఇచ్చి, పాటలు పాడతారు. పిల్లలు పెద్దలకు నమస్కరించి దీవెనలు పొందుతారు.



## సంక్రాంతి

పండుగ సందర్భంగా దూరప్రాంతాలలో స్థిరపడినవారు గ్రామాలకు చేరుకొంటారు. గృహాలలో కుటుంబ సభ్యులు అందరూ కలిసి కులదేవత, ఆరాధ్య దేవతల పూజలు చేస్తారు. ప్రత్యేకంగా సూర్యదేవునికి అర్ఘ్య ప్రదానం చేయడం అనేక ప్రాంతాలలో కనపడుతుంది. సంక్రాంతి సూర్యభగవానుని గమనంతో ముడిపడి ఉన్న పర్వదినం కదా. సాంప్రదాయ నూతన వస్త్రాలు, నగలు ధరించిన బాలికలు సందడి చేస్తారు. బంధుమిత్రులు సంప్రదాయ పిండివంటలు ఇచ్చి పుచ్చుకుంటారు.

## కనుమ

సంక్రాంతి అంటే రైతన్నల పండుగ. వారితో సమానంగా శ్రమపడిన వృషభరాజులకు, గోమాతలకు కనుమ అంకితం.. శుభ్రంగా స్నానం చేయించిన పశువులను పూసల, పూల దండలతో అలంకరిస్తారు. హారతులు ఇచ్చి గౌరవిస్తారు. ఆప్యాయంగా చెఱుకు, పచ్చని పశుదాణా అందిస్తారు. చేదోడువాదోడుగా ఉన్న పాలేరులకు ప్రత్యేకంగా నూతన వస్త్రాలు, ధనం, ధాన్యం ఇస్తారు.

## ముక్కనుమ

కనుమనాడు కాకి అయినా కదలదు అన్నది సంక్రాంతితో ముడిపడి ఉన్న సామెత. పండుగ సంబరాల తరువాత దూర ప్రాంతాల నుండి వచ్చినవారు తిరిగి వెళ్లాలి. కానీ స్వగ్రామంతో, బంధుమిత్రులతో ముడిపడి వున్న అనుభూతులు, పెద్ద పండుగ సంబరాలు వారిని వెంటనే కదలనీయవు. ఆ కారణంగా పై సామెత పుట్టి ఉండవచ్చు. ముక్కనుమ అన్నది ఈ సందర్భంలో సృష్టించినది కావచ్చు. ఈ రోజు నుండి పెద్ద పండుగ మరోసారి అందించిన మధురానుభూతులను తలచుకుంటూ వచ్చినవారు తిరిగి వెళ్లడం, మిగిలినవారు దైనందిన కార్యక్రమాలలో ప్రవేశించడం ఆరంభమవుతుంది.

# 'ఆత్మ' మాట వింటే జీవన సాఫల్యం



పుస్తక సమీక్ష

మనసు అయినా అంతరాత్మ అయినా పొందే అనుభవాలు శారీరక సంబంధం కాకుండా, ఆత్మసంబంధం అనే భావన కారణంగా, కుటుంబ బంధాలు శాశ్వతం కావనే మథన పడే వ్యక్తిత్వం తామరాకు మీద నీటిబొట్టులా 'మనిషిలో మర్మం' నవలలో రావులపాటి సీతారాంరావు 'రమణ' పాత్ర సృష్టించారు. సంసార జీవితంలో గృహస్తు ధర్మాన్ని నిస్వార్థంగా నిర్వర్తిస్తూననేనెవర్ని? అన్న ప్రశ్నకు సమాధానం పొందవచ్చని 'మనిషిలో మర్మం' సూక్ష్మీకరిస్తుంది. పుట్టుక నుంచి మరణం వరకు, జీవితానుభవాలు అన్నీ శరీరానివి అయినప్పుడు, మనసు మనిషి మధ్య తనెవరో అంతర్ముఖ జ్ఞానం తెలియచేస్తుంది. అంతరాత్మ చెప్పే సత్యం ఈ శరీరం నీది కాదు కానీ, శరీరం లేని నీవు సత్యం అని మనిషి తెలుసుకోబడడు. జిజ్ఞాసతో తనను తెలుసుకోవటానికి ప్రయత్నించవచ్చనే అన్వేషణతో ఈ నవలను రావులపాటి సీతారాంరావు తాత్త్వికంగా నడిపించారు. మనిషి, శరీరం శాశ్వతం అనుకొని అహంతో కోరికలకు, మోహానికి బానిస అయి భ్రాంతిలో పడిపోవటంతో అంతరాత్మ అణిగిపోతుంది అంటారు రచయిత. మానవత్వం, అనురాగం, ఆత్మీయత పరిమళించేలా బతికిన మనిషికి దైవత్వం ఎరుక తెలుసుకొనే శక్తి లేకపోతే మళ్ళీ పుట్టుక తప్పదు. రావులపాటి సీతారాంరావు ఈ నవలలో మంచి మనిషిగా బతికే పరిపూర్ణత వలన, పరమాత్మ ఉనికిని మరో జన్మ అంటూ వుంటే పసికట్టవచ్చనే తాత్త్విక సందేశం అందించారు.

**(మనిషిలో 'మర్మం'-రచన: రావులపాటి సీతారాంరావు; వెల: రూ.75/-; ప్రతులకు: ఎమెస్కో బుక్స్ ప్రై.లి., 1-2-7, బానూ కాలనీ, గగన్‌మహల్ రోడ్, దోమలగూడ, హైదరాబాద్-500 029)**

# వివాహ సందర్భంలో అందించే దీవెనలు



కపిలవాయి అశోక్‌బాబు, ఆనందవర్ధన్‌లు సంపాదకులుగా డా॥ కపిలవాయి లింగమూర్తి వాఙ్మయ సాహితీ యజ్ఞంలో భాగంగా ఆ పద్యకవి సమ్రాట్ రచించిన కళ్యాణ గీతికలు పుస్తకంగా వెలువరించారు. పెండ్లిపీటలపై వున్న వధూవరులకు ఆశీఃపూర్వకంగా పద్యాలను రాసి శుభాశీస్సులతో అభినందించటం డా॥ కపిలవాయి కవివరేణ్యుడు నిర్వర్తించేవారు. ఛందోబద్ధంగా ఏదో ఒక చమత్కారం, అలంకారంతో రాసిన ఖండికలు ఆయా కవులు వివాహ వేడుకలో చదివి వినిపించటం, సాహితీ ప్రియులను, కళ్యాణ వేదిక ప్రాంగణాన్ని మరింత శోభాయమానంగా దర్శింపచేస్తుంది. ఈ పుస్తకంలో వధూవరులు, దంపతుల పేర్లు, ఛాయాచిత్రాలతో, వివాహ వేడుక సందర్భంలోని వివిధ ఘట్టాలు, వైవాహిక జీవితం నిండునూరేళ్ల పంటగా కొనసాగాలనే దీవెనలను అందించారు. సీతారామ కళ్యాణం పుస్తక పతాక శీర్షికా దృశ్యం ఆకర్షణీయంగా వుంది.

**(కళ్యాణ గీతికలు-రచన: డా॥ కపిలవాయి లింగమూర్తి; వెల: రూ.100/-లు; ప్రతులకు: కపిలవాయి అశోక్‌బాబు, ఫ్లాట్ 404, 'సి' బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ పామ్, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్, హైదరాబాద్-500 044)**

# ఆడపుట్టుడి విషాదవేదన-పరిష్కృత



కవయిత్రి, కథా రచయిత్రి, విజయ భండారు, సంపాదక సారథ్యంలో వెలువడిన 'పరిష్కృత' కథా సంకలనం, సమాజంలో అణచివేత, వివక్షత, అన్యాయాలకు గురి అవుతున్న మహిళల జీవన పోరాటం, సంక్షోభ పరిష్కారం కథనాలకు అద్దం పడ్తోంది. హైదరాబాద్ మహిళా రచయిత్రుల వేదిక నిర్వహించిన కథా కార్యశాలలో పాల్గొన్న రచయిత్రుల కథలు ప్రచురింపబడిన ఈ సంకలనం కథా కార్యశాల సాధించదలచిన ప్రయోజనాన్ని, సఫలం చేయాలనే ఆలోచనలను నిజాయితీతో ప్రతిబింబింపచేస్తోంది. ఈ సంకలనంలోని, మగాడి అనైతిక క్రూరత్వానికి బలి అవుతున్న ఆడతనం అనుభవిస్తున్న అమానుష జీవన కథనాలు, నిస్సహాయ పోరాట వైఫల్యాలు, సాహసిక పరిష్కార యత్నాలు కథలుగా అనిపించటం లేదు. ప్రతీ కథలోని ప్రధాన పాత్రలన్నీ ఆటబొమ్మలుగా ఊబిలోంచి బయట పడే విముక్తి కోసం పరిష్కారం ఆశించటం, కొన్ని కథలలో ఎదుర్కొని నిలబడగలగటం కనపడుతుంది. బాధల విముక్తికి విడాకులు, మళ్లీ పెళ్లి, సహజీవన వ్యవస్థ, సాహసిక నిర్ణయాలు పరిష్కార మార్గాలుగా కథకులు సూచించారు.

**(పరిష్కృత(కథా కార్యశాల కథలు)-సంపాదకులు: విజయ భండారు; వెల: రూ.300/-; ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాలు; హస్మిత ప్రచురణలు, విజయ భండారు, హెచ్‌ఐజి, బ్లాక్ 1, ఫ్లాట్ 10, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్-44)**

– జయసూర్య

సింగిల్ పేజీ కథ

# మరో ఐదు నిమిషాలు..

బెంగళూరులోని ఇందిరానగర్ పార్కు... సాయంత్రం వేళ. ఆట స్థలం పక్కన ఉన్న చెక్క బల్లపై కూర్చొని ఉన్నాడు నలభయేళ్ళ కార్తీక్ . సాఫ్ట్‌వేర్ కంపెనీలో బిజీ మేనేజర్‌గా ఉండే కార్తీక్, వారాంతపు సాయంత్రం వేళల్లో కూడా తన పని ఒత్తిడిని పూర్తిగా మర్చిపోలేకపోయాడు. అతడి కళ్లన్నీ సైకిల్ తొక్కుతున్న ఏడేళ్ల తన కూతురు సోనాలి మీదే ఉన్నాయి. అదే సమయంలో, అతని పక్క బల్లపై కూర్చోవడానికి వచ్చింది రజని. ఆమె వృత్తిరీత్యా ఒక అనుభవజ్ఞురాలైన ఫ్యామిలీ కౌన్సెలర్, మెంటల్ హెల్త్ ఎక్స్‌పర్ట్. ఆమె పార్కులో ఉన్నా చుట్టూ ఉన్న వ్యక్తుల శారీరక భాష, వారి మధ్య సంభాషణల తీరును నిశితంగా పరిశీలిస్తూ ఉండేది. ఆటలో లీనమైపోయిన తన కుమారుడు శ్యామ్‌ను చూస్తున్న రజని, కార్తీక్ పక్కన కూర్చుంది. "ఆ పసుపు టీషర్టు అబ్బాయి ఉన్నాడే, వాడు నా కొడుకు" అంటూ రజని కావాలనే పలకరించింది.

కార్తీక్ చిరునవ్వుతో, "చాలా చురుకుగా ఉన్నాడు" అన్నాడు. సైకిల్ తొక్కుతున్న తన కూతురిని చూపిస్తూ "ఆ సైకిల్ మీద ఉన్న అమ్మాయి, మా సోనాలి" అన్నాడు.

కార్తీక్ గడియారం చూసి, కూతురిని పిలిచాడు. "సోనా, ఇంక ఇంటికి వెళ్దామా?" అన్నాడు.

సోనాలి సైకిల్ ఆపి, ముఖం చిన్నబుచ్చుకుని, "ప్లీజ్ నాన్నా, ఒక్క ఐదే ఐదు నిమిషాలు" అని అడిగింది. కార్తీక్ నవ్వుతూ తలూపాడు. సోనాలి సంతోషంగా మళ్లీ సైకిల్ ఎక్కింది. ఆ ఐదు నిమిషాలు గడిచాయి. కార్తీక్ లేచి నిలబడి, మళ్లీ కూతురిని పిలవడంతో– సోనాలి మళ్లీ బతిమాలుతూ "ఫైవ్ మోర్ మినిట్స్, డాడ్!" అంది. కార్తీక్ మనస్ఫూర్తిగా నవ్వి, "సరేనమ్మా" అంటూ తిరిగి బల్లపై కూర్చున్నాడు.



ఈ దృశ్యం చూస్తున్న రజని ఆశ్చర్యంతో కార్తీక్‌తో "మీరు చాలా ఓర్పున్న తండ్రి అండీ! పిల్లలు అంతలా అడిగినా, మీరు నవ్వుతూ ఒప్పుకోవడం గొప్ప విషయం. ఈ రోజుల్లో పిల్లల కోసం ఇలా సమయం కేటాయించేవారు చాలా అరుదు" అని, రజని వైపు చూసి మెల్లగా నవ్వాడు. అతని కళ్ళల్లో ఏదో విషాదం మెరిసింది. "నేను ఓపిక చూపించడం లేదు, రజని గారూ. ఇది కేవలం ఓపిక కాదు, అంతకు మించి ఉన్న ఒక బాధ్యత" "అదేమిటండీ?" అని రజని అడిగింది.

కార్తీక్ చిన్నగా నిట్టూర్చి, తన కళ్లలో పేరుకుపోయిన బాధను అణచుకోవడానికి ప్రయత్నిస్తూ, గొంతు సవరించుకుని "మా పెద్దబ్బాయి పేరు అభినవ్. వాడు నాకు జ్ఞాపకాల రూపంలోనే మిగిలిపోయాడు. సరిగ్గా పోయిన సంవత్సరం ఇదే పార్కు దగ్గర, ఇక్కడికి కొంచెం దూరంలో ఉన్న మెయిన్ రోడ్డుపై వాడు ఉత్సాహంగా సైకిల్ తొక్కుతుండగా, బాధ్యత లేకుండా, తాగి కారు నడిపిన ఒక వ్యక్తి అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఆ క్షణంలో నా ప్రపంచం ఆగిపోయింది. ఆ బాధ నన్ను ప్రతి నిమిషం వెంటాడుతూనే ఉంటుంది" అన్నాడు. రజని, ఒక కౌన్సెలర్ అయినప్పటికీ, ఆ మాట విని ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది. ఆమె వృత్తిపరమైన దూరాన్ని పక్కన పెట్టి, కేవలం ఒక తల్లిగా, ఆ తండ్రి పడుతున్న వేదనను అర్థం చేసుకుంది. ఆమె గొంతులో సానుభూతి నిండిపోయింది. "కార్తీక్ గారూ, వినడానికి చాలా బాధాకరంగా ఉంది" కార్తీక్ తన కళ్ళలో చేరిన కన్నీటిని ఆపుకోవడానికి తల దించుకున్నాడు. ఆ నొప్పిని బయటపెట్టడానికి ధైర్యం తెచ్చుకుంటూ, "అభినవ్‌తో నేను సరిగా సమయం గడపలేకపోయాను, రజని గారూ. ఎప్పుడూ ఆఫీసులో బిజీగా ఉండేవాడిని. వాడు నా వద్దకు వచ్చి, "నాన్నా, కాసేపు ఆడుకుందాం, నాన్నా, ఐదు నిమిషాలు సైకిల్ తొక్కుతాను" అని ఎన్నిసార్లు అడిగినా, "నాకు టైం లేదురా" అనే సమాధానం తప్ప, ఇంకో మాట చెప్పలేకపోయాను" అంటూ గద్గద స్వరంతో తన పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చాడు. "ఇప్పుడు ఒక్క ఐదు నిమిషాలు వాడితో గడపడానికి నా ప్రాణమైనా ఇస్తాను. కానీ ఆ అవకాశం నాకు లేదు. ఆ తప్పు సోనాలి విషయంలో చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను. తనను చూస్తుంటే నాలో నేను అనుభవించే గిల్ట్ కొంచెం తగ్గుతుంది" కార్తీక్ సోనాలి వైపు ప్రేమగా చూస్తూ, ఆ మాట పూర్తి చేశాడు.

"సోనాలి తనకి మరో ఐదు నిమిషాలు సైకిల్ తొక్కుకోవడానికి దొరికిందని అనుకుంటోంది. కానీ, నిజం ఏమిటంటే... ఆ ఐదు నిమిషాలు తన ఆనందాన్ని దగ్గరుండి చూసే అదృష్టం నాకు దొరుకుతోంది".

ఆ మాట విని రజని కళ్ళలోనూ నీళ్లు తిరిగాయి. ఆ దృశ్యం చూస్తుండగా, ఆ రోజు ఆ పార్కులో చిన్నారుల నవ్వుల కన్నా, ఒక తండ్రి ప్రేమ, పశ్చాత్తాపం మరింత శక్తివంతంగా ప్రతిధ్వనించాయి.

– సి. హెచ్. ప్రతాప్

# ఈ వారం కవిత్వం

## తేడా..

పొత్తిళ్లలో
పసిగుడ్డు సైతం
పిడికిళ్ళు బిగించి
చేతులు ఝుళిపిస్తూ
గర్జనలతో
చైతన్యాన్ని సృష్టిస్తే
మనసూ వయసూ
పెరిగిన
ఈ మనిషి మాత్రం
భయం భయంగా
కుచించుకుపోతూ
పిరికితనాన్ని
పుట్టిస్తున్నాడు.

– డా॥ కొరుప్రోలు హరనాథ్

## హృదయాకాశంలో..

ఈ గాలి లేకుండా
ఊపిరి ఊగుతుందా
ప్రశ్న వాలుతోంది.

క్షణాల్ని లెక్కించే నన్ను చూసి
ఆ పక్షులు నువ్వుకుంటున్నాయి.
ప్రశాంతమైన ఆకాశం
నాపై జాలి చూపులు చూస్తోంది.
ఎంత దూరం నడిచినా

నిశ్శబ్దం లేని జీవితాన్ని చూసి
చెట్టు కిలకిలా నవ్వుతోంది.
పరుగుల జీవితాన్ని చూసి
ఈ హరివిల్లు
రంగుల జీవితమేదని ప్రశ్నిస్తోంది.

సంఘర్షణల్లో తడవటం కాదు
వర్షం తనలో మునిగి
తేలమంటోంది.

సరికొత్త జీవితంతో
మొలకెత్తమంటోంది.
ఆమె నా కళ్ళలో
ప్రేమ దీపాల్ని మెరిపించి
కోల్పోతున్న వాటిని
వెలిగించాలని పరితపిస్తోంది ...!

– డా॥ కొరుప్రోలు హరనాథ్

## ఎప్పటి కాలమో ఇది!

ఎంత నడిచినా ఉరికినా
ఇంకా దూరం ఎంతో మిగిలే వుంది.
ఎంతటి కాలమో ఇది
ఎంత తొవ్వినా తొలిచినా
ఇంకా ఏదో రహస్య నిధి
దొరికినట్లే దొరికి
చేజారిపోతోంది.

ఎక్కడి కాలమో ఇది
పయనం మొదలు
ఆది అంతం కానరానిది.
ఎవరి కాలమో ఇది..
వలస వచ్చిపోయే
పక్షులకు స్వాగతం
పలుకుతున్న ప్రకృతి కలకాలం

– శ్రిష్టి శేషగిరి

## కాదనలేని నిజం

వేళకు వచ్చే సూర్యుడు లేడు
అలా వచ్చిపోయే
వెన్నెలా లేదు
వేల నక్షత్రాలు వెదుకుతున్నా
ఎక్కడ చంద్రుడు?



తడి ఆరిన జ్ఞాపకాల్లో
ఇంద్రధనస్సు ఊగిపోతుంది.
సుతారంగా కాలం
మారిపోతుంది
మమతలు కరువై
అరణ్యం మనసంతా
అల్లుకొంటుంది
ఈ లోకానికి మనల్ని
ఎవరు పరిచయం
చేశారో?
వాళ్ల ఆచూకి లేదు
అంతా మౌన ప్రపంచం
గాలి అలలా ఊగిసలాట
చీకట్లు కురిసే రాత్రులు
కలవరపాటుతో
బతుకును వెదుక్కొనే
ఓ అలవాటు
కాలమిలా ప్రవహిస్తుంది
కాదనలేని నిజం.

– రవి మాగంటి

## మనిషి కాటు

వాస్తవాలన్నీ కఠినమైనవే
నిరీక్షించినవన్నీ
వికృతమైన
నవ్వుతో పలకరించినపుడు..!
బతుకుచిత్రంలో
రంగు పలచబడినపుడు
గుర్తింపు కోసం తపన పడడం
తనని తాను శపించుకోవడమే !

ఒక్కోసారి అకారణ దిగులు
జీవితాన్ని అతలాకుతలం చేస్తుంది.
అన్ని
వైపుల్నుంచి
ఊపిరాడని
వాతావరణం
హింసాత్మక
కట్టడంలా మారుతుంది.
నిజానికి కుట్ర కూడా

తెల్లగా నవ్వుతూ
ప్రేమకవితలా పలకరిస్తుంది.
విషాదాన్ని భరించడం
నేర్చుకోగలిగిన వాడికి
కళ్ళతో నవ్వడం తెలియదా ఏంటి?
మనసు దెబ్బనే కాచుకున్నప్పుడు
మనిషి కాటును ఓర్చుకోవడం
సులభమే మరి..!

– ఏటూరి నాగేంద్రరావు

# స్క్రబ్ టైఫస్ - నివారణ



వర్షాకాలంలో తరచుగా, ఎపిడమిక్‌గాను వచ్చే జ్వరాల్లో స్క్రబ్ టైఫస్ ఒకటనే చెప్పాలి. ఈ మధ్య తరచు వచ్చే తుఫాన్ల వల్ల ప్రబలిన స్క్రబ్ టైఫస్ వ్యాధిగ్రస్తుల సంఖ్య వేలల్లో ఉండడం, మరణాలు సంభవించడంతో ఆరోగ్యశాఖ అప్రమత్తతతో వ్యవహరించి అందరిని హెచ్చరించడంతో ఇది అందరి దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ జ్వరాలు కలకలం సృష్టించిన దాదాపు అన్ని జిల్లాల్లో నమోదు అయిన కేసుల సంఖ్య కొద్దిగానే ఉన్నప్పటికి (వందల సంఖ్యలో) అనధికారికంగా వేల సంఖ్యలో బాధితులుండవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## జాగ్రత్తలు

స్క్రబ్ టైఫస్ అనేది బాక్టీరియా ఇన్ఫెక్షన్. ఇది గ్రామ్ నెగటివ్‌కి చెందిన ప్రోటి బాక్టీరియం. ఇది రికెట్సియేసి కుటుంబానికి చెందిన బాక్టీరియా. ఈ బాక్టీరియా సోకిన బిగ్గర్‌మైట్ అనే నల్లిని పోలిన చిన్నకీటకం/ పురుగు కుట్టడం వల్ల ఈ ఇన్ఫెక్షన్ వస్తుంది. ఇవి ఎలుకలు, ఉడతలు వంటి జంతువుల నుండి బ్యాక్టీరియాని తీసుకొని ఆహారం తీసుకునేటప్పుడు వ్యాపిస్తాయి.

ఇవి గడ్డి నేలలు, పొలాలు, దట్టమైన పొదలు, తోటలు అడవుల్లో, బీడు నేలల్లో తిరిగినప్పుడు ఇవి కుడతాయి. ఈ పురుగు కుట్టినప్పుడు దాని లాలాజలం ద్వారా ఓరియాంటియా సుట్సుగముషి అనే బాక్టీరియా మనిషి రక్తంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కి కారణమవుతుంది. రాత్రి సమయాల్లో అధికంగా ఈ పురుగులు మనుషుల్ని కుడుతుంటాయి. ముఖ్యంగా ప్రయాణికులు, గ్రామీణ ప్రాంతాల్లోని వారిలో ఎక్కువగా కన్పిస్తుంది. దీన్ని మొదటిసారిగా దీనిని జపాన్‌లో 1930లో గుర్తించారు. ఇది ఆగ్నేయాసియా, ఇండోనేషియా, చైనా జపాన్, భారత్, పాకిస్తాన్, థాయిలాండ్, వియత్నాం, శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియాలో ఎక్కువగా ప్రబలి వుండే బాక్టీరియల్ ఇన్ఫెక్షన్. ఇది ఉష్ణమండల, ఉప ఉష్ణమండల, ప్రాంతాల్లో కన్పించే ఇన్ఫెక్షన్. ఇది టైఫస్ సోకిన లార్వా మైట్స్ (చిగ్గర్స్) కాటు ద్వారా ప్రజలకి వ్యాపిస్తుంది. ఈ అంటువ్యాధిని చైనాలో క్రీ.శ. 313లోనే మొదటిసారి వర్ణించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పొదలున్న చోట ఈ వ్యాధి కన్పించడంతో దీన్ని 'స్కబ్ టైఫస్' అని అంటారు.

పరిశుభ్రత లోపించిన వారిలో, దీర్ఘకాలిక వ్యాధులు, తరుచూ అనారోగ్యాలతో బాధపడే వారిలో, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో, అధిక సంఖ్యలో ప్రజలు వున్నచోట, స్టెరాయిడ్స్, తరచూ ఆంటీబయాటిక్స్ వాడే వారిలో ఈ వ్యాధి ఎక్కువగా కన్పిస్తుంది. స్క్రబ్ టైఫస్‌తో 25.3 శాతం మంది బాధపడుతుంటారు. ఇది వయోభేదం, ఆడ, మగ తేడా లేకుండా ఎవరిలోనైనా రావచ్చు.

గ్రామీణులు ఎక్కువగా ఈ అంటువ్యాధితో బాధపడడం వల్ల దీన్ని 'గ్రామీణ టైఫస్' అని కూడా అంటారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రతి సంవత్సరం వర్షాకాలంలో స్క్రబ్ టైఫస్‌తో అనారోగ్యానికి గురవ్వడం విశేషం. స్క్రబ్ టైఫస్ కీటకాల తాకిడి ఆగస్టు నుంచి ఫిబ్రవరి మధ్య ఎక్కువగా ఉంటుంది.

## వ్యాధి లక్షణాలు

ఇది అనేక రకాల లక్షణాలతో వచ్చే ఒక అంటువ్యాధి. ఇది కుట్టిన 10-12 రోజులకి వ్యాధి లక్షణాలు బయటపడతాయి. తరచుగా అకస్మాత్తుగా అధికజ్వరం రావడం ఉంటుంది. తీవ్రమైన కండరాలు, కీళ్ల నొప్పులతో చలి ఉంటుంది. తీవ్రమైన కండరాలు, కీళ్లనొప్పులతో చలి ఉంటుంది. తలనొప్పి ఎక్కువగా ఉండి కాంతికి సున్నితత్వం కారణంగా పెరుగుతుంది. దగ్గు, కళ్లు ఎర్రబడడం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్స్ వస్తాయి. వికారం, వాంతులు, కడుపునొప్పి, విరోచనాలు వంటి జీర్ణకోశ లక్షణాలుంటాయి. వీరిలో నీరసం, అలసట, ఏర్పడుతుంది.

ఇది కుట్టిన చోట నల్లని స్కాబ్ (గట్టిపొర) ఏర్పడుతుంది. పదం ఎస్కారా నుండి దీన్నే 'ఎస్చార్' అని అంటారు. చర్మంపై ముఖ్యంగా ఊదా లేదా ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. శ్వాస వేగం ఎక్కువగా ఉంటుంది. రోగి గందరగోళంగా, అయోమయంగా, డిప్రెషన్‌గా ఉండడం వంటి మానసిక మార్పులు ఏర్పడతాయి. దీనిని నిర్లక్ష్యం చేయరాదు. నిర్లక్ష్యం చేస్తే ఇది కొన్ని నెలల పాటు ఉండడం వల్ల కొన్ని కాంప్లికేషన్స్ ఏర్పడతాయి. పాంక్రియాటైటిస్, వినికిడిలోపాలు, నర్వస్ సిస్టమ్ లోపాలు, కపాలనాడి పక్షవాతం, న్యూమోనియా మొదలైన సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## వ్యాధి నిర్ధారణ

దీన్ని పరోక్ష ఇమ్యూనో ఫ్లోరోసైన్స్ ఆంటీబాడీ ఐఎఫ్ఎ పరీక్షలు, ఇమ్యూనో క్రోమాటో గ్రాఫిక్ పరీక్షలు, వీల్ ఫెలిక్స్ పరీక్ష, బాక్టీరియల్ పరీక్ష ద్వారా, రక్త పరీక్షల ద్వారా పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. అవసరమైతే సీరాలాజికల్ టెస్ట్, ఎస్టార్ స్వాబ్, ఇమ్యూనోస్టెయినింగ్ పద్ధతులు, పాలిమరేస్ బైన్ రియాక్షన్ (పిసిఆర్) పరీక్షల ద్వారా నిర్ధారించవచ్చు.

## చికిత్స

డాక్సీ సైక్లిన్, అజిత్రోమైసిన్, రిఫాంపిన్, క్లోరాంఫెనికాల్, సిప్రోఫ్లోక్స సిస్ మందుల్ని వైద్య పర్యవేక్షణలో వాడల్సి ఉంటుంది.

– గర్భిణిలకు స్క్రీబ్ టైఫస్ వస్తే జాగ్రత్తలు పాటించాలి. కొందరిలో ఆకస్మిక గర్భస్రావం వచ్చే అవకాశం ఉంది. బయటికి వెళ్లేటప్పుడు ఇన్ఫెక్షన్ నివారించడానికి పొడవాటి చేతుల దుస్తులు, ప్యాంట్, బూట్లు ధరించాలి. దట్టమైన గడ్డి మైదానాలు, అడవులు, పొదలలోకి పోకుండా చూడాలి. రాత్రివేళ, చీకటి పడిన తర్వాత చెట్ల మధ్యకి వెళ్లకూడదు.

– మురికివాడల్లో, అధిక జనాభా ఉన్న ప్రదేశాల్లో ఎక్కువ పరిశుభ్రత అవసరం. పెర్మెత్రిన్ మందులతో పరిసరాల్ని పిచికారీ చేయాలి.

– చిగ్గర్ కాటు వేసిన ప్రాంతం సిగరెట్ కాల్చిన గాయాన్ని పోలి ఉంటుంది. దీనికి ఆంటి సెప్టిక్ ఆయింట్‌మెంట్స్ అప్లై చేయాలి. ఇవి ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లు, తోటల్లో, పొలాల్లో నిద్రించేవారికి బాక్టీరియాని మోసే పురుగులకి గురయ్యే అవకాశాన్ని పెంచుతుంది. కాబట్టి శీతాకాలంలో, వర్షాకాలంలో చలితో పాటు, టిగ్గర్ మైట్స్ కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలి.

– రెండు పూటలా స్నానం చేయాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. అవసరమైతే బయాప్సీ, లాంప్ వంటి సీరోలాజికల్ పరీక్షలు



చేయించుకోవాలి. అవసరమైతే ఇంట్రావీనస్ మందుల్ని వాడాల్సి ఉంటుంది.

– తగిన విశ్రాంతి, హైడ్రేషన్ అవసరం. నేలపై నేరుగా కూర్చోవడం మానుకోవాలి. అందరికి అన్నిలక్షణాలు కన్పించవు. కొందరిలో తేలికపాటి జ్వరం లేదా అలసట ఉండవచ్చు. కొందరిలో తేలికపాటి ఇన్ఫెక్షన్స్ సర్వసాధారణంగా కన్పించే స్క్రబ్ టైఫస్ పట్ల అప్రమత్తతతో వ్యవహరించాల్సి ఉంటుంది. జ్వరం ఎక్కువ రోజులుంటే దద్దుర్లు, ఒళ్లు నొప్పులుంటే స్క్రబ్ టైఫస్ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది.

– స్క్రబ్ టైఫస్ లక్షణాల్ని ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందిస్తే 90-95 శాతం కేసుల్ని సత్వరం నివారణ ద్వారా నయం చేయవచ్చు.

– స్క్రబ్ టైఫస్ వ్యక్తి నుండి వ్యక్తికి వ్యాపించదు. ఇది సోకిన బిగ్గర్ కాటు ద్వారా మాత్రమే వ్యాపిస్తుంది. తేలికగా జీర్ణమయ్యే ఆహారం, ప్రోటీన్, పండ్లు (అరటి, ఆపిల్, బొప్పాయి, పుచ్చకాయ) గంజి, సూప్‌లు, సలాడ్స్ వాడుకోవాలి. కారం, మసాలాలు, వేపుళ్లు ప్రాసెస్ చేసిన ఆహారాలు, జీర్ణంకాని ఆహారాలు తీసుకోరాదు. గింజలు, పచ్చికూరగాయలు, మిల్లెట్స్ తినరాదు.

– ఇది సీరియస్ ఇన్ఫెక్షన్. ముందుగా గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా కోలుకోవచ్చు. లేదంటే అవయవాల వైఫల్యానికి గురి కావాల్సి ఉంటుంది. హోమియోలో ఆర్స్, ఆల్బ బెల్సీ మియం, ఫెర్రంఫాస్ యంపటోరియం, రూస్టాక్స్, బాప్టీమియా మందుల్ని వాడి స్క్రబ్ టైఫసీ నుండి సత్వర నివారణ పొందండి.

స్క్రబ్‌టైఫస్ జ్వరాల వల్ల ఆందోళ చెందాల్సిన అవసరం లేదని ఆరోగ్యాధికారులు హెచ్చరించినప్పటికి శీతాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే మంచిది. ఇది కూడా సాధారణ జ్వరం లాంటిదేనని, జ్వరం బారిన పడిన మూడు రోజుల వరకు తగ్గకపోతే రక్త పరీక్షల ద్వారా, శరీరంపై ఏర్పడే చిన్న నల్ల మచ్చ (పాస్చార్ కాటు) ద్వారా రక్త పరీక్షలు చేసుకొని వ్యాధి నిర్ధారణ చేయించుకొని తగిన చికిత్స చేయించుకోవాలి. పాత మంచాలు, పరుపులు, దిండ్లు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలి. మీరు నివాసం ఉండే చోట పందులు, ఎలుకల సంచారం తక్కువగా ఉండేలా చూసుకోవాలి. తడి నేలలు, పొలాలు, పశువుల పాకల్లో పని చేసేవారు, గడ్డి కోసేవారు అప్రమత్తంగా ఉండాలి. పొలం పనులకి వెళ్లేవారు రబ్బరు బూట్లు, చేతులకు గ్లౌవ్స్, నోటికి మాస్క్ ధరించాలి. పిల్లలకి, కాళ్లు చేతులు కప్పి ఉంచేలా దుస్తులు ధరించడం మంచిది. ఏదైనా పురుగు కుట్టినప్పుడు వెంటనే డాక్టర్ని సంప్రదించడం అన్ని విధాలా మంచిది.

– డా॥ కె. ఉమాదేవి

కథ

# కనువిప్పు

సోము అల్లరి పిల్లవాడు. బడి నుంచి ఇంటికి చేరాక పుస్తకాల సంచి ఇంట్లో పడేసి రాత్రి దాకా బయట క్రికెట్ ఆట ఆడి వచ్చేవాడు. సెలవు రోజుల్లో పూర్తిగా ఇంటి పట్టున ఉండడు. తల్లిదండ్రుల మాటకు బాగా ఎదురు చెబుతాడు.



సోము చెల్లెలు స్రవంతి చదువులో చాలా తెలివైన అమ్మాయి. అన్నకు చదువు విలువ గురించి ఎన్నో సార్లు చెప్పి చూసింది. అయినా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు అయ్యేది.

సంక్రాంతి సెలవుల్లో సోము గాలిపటం ఎగుర వేస్తున్నాడు. చాలాసేపు ఎగుర వేశాడు. మరొక తుంటరి పిల్లవాడు గాలిపటం ఎగురవేస్తూ సోమూ గాలిపటం దారానికి మెలి వేశాడు.


దాంతో సోము గాలిపటం తెగిపోయింది. అది చాలా ఖరీదైన గాలిపటం. ఎంత వెదకినా సోమూకు దొరకలేదు. సోమూ చాలా విచారంగా ఉన్నాడు. వాడికి ఏడుపు ఒక్కటే తక్కువ. చాలా దిగులుగా కూర్చున్నాడు.

ఇంతలో సోము క్లాస్ మేట్ అపర్ణ అక్కడకు వచ్చింది. సోమూ దిగులుగా ఉన్న కారణం తెలుసుకుంది. “నువ్వు ఎంతో ఖరీదు పెట్టి కొన్న గాలిపటం నీకు దొరకకుండా పోయిందని నువ్వు బాధ పడుతున్నావు. నిన్ను 13 యేళ్లుగా పెంచుతూ నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న నీ తల్లిదండ్రులను బాధ పెడుతూ, వారికి పూర్తిగా అందకుండా పోయినావు. నిన్ను కన్న తల్లిదండ్రులు నీ గురించి ఎంత బాధపడుతున్నారో ఆలోచించు” అన్నది అపర్ణ.

సోము ఆలోచనలో పడ్డాడు. సిగ్గుతో తల దించుకున్నాడు. ఇంటి పట్టునే ఉంటూ శ్రద్ధగా చదువుకోవాలని నిశ్చయించుకున్నాడు.

– సరికొండ శ్రీనివాసరాజు

## చుక్కలు కలపండి





వార్త ఆదివారం

## బాలగేయం

## బాలవీరులం

నేటి బాలవీరులం
రేపు భరత
యువకులం
కులం మతం మరచెదం
కలసి మెలసి బ్రతికెదం

గంగ సింధు కావేరి
తుంగభద్ర గోదావరి
అంగరంగ వైభోగం

తెలుగు గంగ
మనదేరా
కాశ్మీరం మన హద్దు
కన్యాకుమారి హద్దు
ఆసేతుహిమాచలం

అన్నపూర్ణ
మన తల్లి
కర్మభూమి
ఈ దేశం
పుణ్యభూమి మన దేశం
సాదు సంతులతో కూడిన
వేదభూమి
మన దేశం

– ఆవుల వెంకటరమణ

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**సి.విశ్వనాథ్, నల్గొండ**

**ప్రశ్న:** నావికులు మన దేశం నుంచి ఆఫ్రికా ప్రయాణించేందుకు శీతాకాలాన్ని; తిరిగి మన దేశానికి రావడానికి వేసవినీ ఎంచుకుంటారు. కారణమేంటి?

**జవాబు:** పూర్వకాలంలో సముద్ర ప్రయాణికులు రుతుపవనాలు వీచే దిశగా అంటే– వాటితో పాటుగా ప్రయాణించేవారు. శీతాకాలంలో రుతుపవనాలు ఈశాన్యం నుంచి నైరుతి దిశ వైపుగా ప్రయాణిస్తాయి. కాబట్టి, ఆ సమయంలో మన దేశం నుంచి ఆఫ్రికాకు ప్రయాణించేవారు. అదేవిధంగా వేసవిలో నైరుతి నుంచి రుతుపవనాలు మన దేశంలోకి ప్రవేశిస్తాయి కనుక ఆ సమయంలో ఆఫ్రికా నుంచి తిరుగు ప్రయాణమయ్యేవారు.

**ఎ.మహిజ, ఆదిలాబాద్**

**ప్రశ్న:** సమురాయ్‌లు అంటే ఎవరు?

**జవాబు:** జపాన్‌లో ధైర్యసాహసాలు కలిగిన యుద్ధవీరులు ఈ సమురాయ్‌లు. వీరి ద్వంద్వ యుద్ధాలు భీకరంగా ఉంటాయి. సమురాయ్‌ల దగ్గర ఎప్పుడూ రెండు కత్తులుంటాయి. తలకు దుస్తుల అలంకరణ భారీగా ఉంటుంది. విశ్వాసంతో, ధైర్యంతో ప్రవర్తించాలని ఆదేశించే బుషిడో నిబంధనకు అనుగుణంగా వీరు జీవిస్తారు. ఈ విషయంలో వీళ్లు నిక్కచ్చిగా ఉంటారు. గౌరవం కోల్పోయామని భావిస్తే సమురాయ్ ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడదు. వీరు మొదట్లో జపాన్ చక్రవర్తికి రక్షక భటులుగా ఉండేవారు. 1185వ సంవత్సరంలో చక్రవర్తి అధికారం కోల్పోయాడు. జపాన్ భూస్వామ్య రాజ్యంగా మారింది. దేశాన్ని షోగన్ అనే ప్రభువు పాలించేవాడు. ఆయన కింద భూస్వామ్య పాలకులు, వారికి సేవ చేసేందుకు సాముురాయ్‌లు ఉండేవారన్నమాట.





# యుగ పురుషుడు.. స్వామి వివేకానంద

**భారత జాతి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఔన్నత్యాన్ని ప్రపంచ వేదికలపై గర్వంగా ప్రకటించిన మహనీయుడు స్వామి వివేకానందుడు. భారతదేశం కేవలం భౌగోళిక సరిహద్దులతో పరిమితమైన దేశం కాదని, అది శాశ్వతమైన ధర్మసాంప్రదాయాలకు, విశాలమైన మానవతావాదానికి, సనాతనమైన ఆధ్యాత్మిక తత్వానికి నిలయమని పాశ్చాత్య ప్రపంచానికి చాటి చెప్పిన తొలి హిందూ సన్యాసి ఆయన. ఉపన్యాసకుడిగా, తత్వవేత్తగా, యోగిగా, సమాజ సంస్కర్తగా, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాతగా వివేకానందుడు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.**

1863 జనవరి 12న బ్రిటిష్ బెంగాల్ ప్రెసిడెన్సీలోని కలకత్తా (నేటి కోల్‌కతా) నగరంలో ఒక సంప్రదాయబద్ధమైన బెంగాలీ కుటుంబంలో నరేంద్రనాథ్ దత్తగా జన్మించిన వివేకానందుడు, బాల్యం నుంచే అసాధారణ ప్రతిభను ప్రదర్శించాడు.

తండ్రి విశ్వనాథ్ దత్త న్యాయవాది, తల్లి భువనేశ్వరి దేవి ఆధ్యాత్మిక భావనలు కలిగిన ధార్మికురాలు. తల్లి నుండి భక్తి, దయ, నిస్వార్థతను; తండ్రి నుండి తార్కిక ఆలోచనలను, ధైర్యాన్ని ఆయన వారసత్వంగా పొందాడు. చిన్న వయసులోనే ధ్యానం, భజనలు, సన్యాసుల పట్ల ఆదరణ వంటి లక్షణాలు నరేంద్రునిలో స్పష్టంగా కనిపించేవి. పువ్వు పుట్టగానే పరిమళం వెదజల్లినట్లు, ఆయన వ్యక్తిత్వంలో ఆధ్యాత్మిక చైతన్యం సహజంగానే వికసించింది.

విద్యాభ్యాసంలోనూ నరేంద్రుడు అసాధారణ ప్రతిభను కనబరిచాడు. ఆటపాటల్లో చురుకుగా ఉంటూనే చదువులోనూ ముందుండేవాడు. అమోఘమైన జ్ఞాపకశక్తి, విశ్లేషణాత్మక ఆలోచనలతో గురువులను ఆశ్చర్యపరచేవాడు. 1880లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసి కళాశాలలో చేరి చరిత్ర, శాస్త్ర విజ్ఞానం, పాశ్చాత్య తత్వశాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేశాడు. ప్లేటో, కాంట్, హెగెల్ వంటి తత్వవేత్తల ఆలోచనలు ఆయనను ఆకర్షించినా, జీవన సత్యానికి సమాధానం దొరకలేదనే అసంతృప్తి వెంటాడుతూనే ఉండేది. మూఢనమ్మకాలను తోసిపుచ్చినప్పటికీ, భగవంతుని అనుభూతి కోసం తపనతో పండితులతో వాదనలు సాగించాడు. అయితే తార్కిక వాదనలు అతని అంతర్ముఖ ప్రశ్నలకు పూర్తి సమాధానం ఇవ్వలేకపోయాయి.



అటువంటి దశలో రామకృష్ణ పరమహంస అనే మహాత్ముడు భగవంతుని ప్రత్యక్షంగా అనుభవించిన వాడని విన్నాడు.

మిత్రులతో కలిసి దక్షిణేశ్వర్‌లో ఆయనను దర్శించగా, ఆ క్షణమే నరేంద్రుని జీవితంలో మలుపు ఏర్పడింది. రామకృష్ణుని రూపం, వాక్చాతుర్యం, ఆధ్యాత్మిక ప్రకాశం నరేంద్రునిలో అపూర్వమైన అనుభూతిని కలిగించాయి. "నీవు పాడగలవా?" అని అడిగి, నరేంద్రుని గానం విని మంత్రముగ్ధుడైన రామకృష్ణుడు, "ఇంత ఆలస్యమేమిటి? ఇన్ని రోజులుగా నీ కోసం ఎదురు చూస్తున్నాను" అంటూ అతనిలో దైవ స్వరూపాన్ని దర్శించాడు. "భగవంతుని చూశారా?" అన్న నరేంద్రుని ప్రశ్నకు "అవును, నీకు కూడా చూపించగలను" అన్న రామకృష్ణుని సమాధానం నరేంద్రుని జీవితానికి దిశానిర్దేశం చేసింది.

తర్వాతి రోజుల్లో రామకృష్ణుని సమీపంలో నరేంద్రుడు అనేక ఆధ్యాత్మిక అనుభూతులను పొందాడు. ఒక సందర్భంలో ధ్యానావస్థలో రామకృష్ణుడు తన పాదాన్ని నరేంద్రుని ఒడిలో ఉంచగానే, నరేంద్రుడు బాహ్య ప్రపంచంతో సంబంధం కోల్పోయి పరమానంద స్థితిని అనుభవించాడు. ఆ అనుభవమే అతని తర్కబద్ధమైన మనసును ఆధ్యాత్మిక విశ్వాసంగా మలిచింది. అయినా ఆయన అంధ విశ్వాసాన్ని స్వీకరించలేదు; ప్రతి అంశాన్ని అనుభవంతో, తర్కంతో పరిశీలించేవాడు. ఈ కారణంగానే రామకృష్ణుడు అతన్ని ముఖ్య శిష్యుడుగా గుర్తించాడు.

తండ్రి మరణంతో కుటుంబ బాధ్యతలు నరేంద్రునిపై పడ్డాయి. ఉపాధ్యాయ వృత్తిలో చేరినా, గురువైన రామకృష్ణునికి గొంతు క్యాన్సర్ సోకి ఆరోగ్యం క్షీణించడంతో ఉద్యోగాన్ని వదిలి..



శుశ్రూషలో నిమగ్నమయ్యాడు. 1886లో రామకృష్ణ పరమహంస మహాసమాధి పొందే వేళ తన ఆధ్యాత్మిక శక్తులన్నిటిని నరేంద్రునికి ధారపోశాడన్న విశ్వాసం ఉంది. గురువు మరణానంతరం గంగాతీరంలో రామకృష్ణ మఠాన్ని స్థాపించి, శిష్యులతో కలిసి సన్యాసం స్వీకరించి 'వివేకానందుడు' అనే నామంతో దేశవ్యాప్తంగా సంచరించాడు.

కాషాయ వస్త్రం, కమండలం మాత్రమే సంపదగా దేశమంతా తిరుగుతూ, ప్రజల దుఃఖాలను దగ్గరగా చూశాడు. పేదరికం, అజ్ఞానం, సామాజిక అసమానతలు భారతదేశాన్ని ఎలా కుంగదీస్తున్నాయో గ్రహించాడు. "భారతదేశం నా గృహం, భారతీయులందరూ నా సోదరులే" అనే భావనతో జీవించాడు.

మైసూరు మహారాజు, భాస్కర సేతుపతి వంటి పాలకులతో పరిచయాలు ఏర్పడి, భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని వివరించాడు. అమెరికాలో వేదాంతాన్ని ప్రచారం చేయాలన్న సంకల్పంతో 1893 మే 31న బొంబాయి నుండి నౌకాయానం చేసి చికాగో చేరాడు.

1893 సెప్టెంబర్ 11న జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటు సదస్సులో 'అమెరికా దేశపు సోదరులారా!' అనే మధుర స్వరంతో చేసిన ఆరంభ వాక్యమే ప్రపంచాన్ని మంత్రముగ్ధులను చేసింది. మూడు నిమిషాల పాటు చప్పట్లతో సభ మార్మోగింది. హిందూ ధర్మాన్ని విశాలమైన మానవతా తత్వంగా, సార్వత్రిక సహనానికి ప్రతీకగా వివరించిన ఆయన ప్రసంగం భారతదేశానికి అపూర్వమైన గౌరవాన్ని తెచ్చింది. ఆ ఒక్క ఉపన్యాసంతోనే వివేకానందుడు ప్రపంచ ప్రఖ్యాతి గడించాడు. అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాలలో ఉపన్యాసాలు ఇచ్చి తూర్పు-పశ్చిమ సంస్కృతుల మధ్య వారధి నిర్మించాడు. మార్గరెట్ నోబుల్ వంటి పాశ్చాత్యులు ఆయన శిష్యులై, 'సిస్టర్ నివేదిత'గా భారత సేవలో జీవితాన్ని అంకితం చేశారు.

1897లో స్వదేశానికి తిరిగివచ్చిన వివేకానందుడిని మద్రాసులో ఘనంగా స్వాగతించారు. "వ్యక్తి మోక్షమునకు, ప్రపంచ హితమునకు" అనే నినాదంతో రామకృష్ణ మిషన్‌ను స్థాపించి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు. 'జీవుడే దేవుడు' అన్న వేదాంత భావనను కార్యరూపంలోకి తెచ్చి, పేదలకు సేవ చేయడాన్ని 'దరిద్ర నారాయణ సేవ'గా పేర్కొన్నాడు. ఆయన దృష్టిలో మతం సిద్ధాంతాల సమాహారం కాదు; మానవ సేవే మతం.

యువతపై ఆయనకు అపారమైన నమ్మకం. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం" అని ఆయన పదే పదే చెప్పేవాడు. "లేవండి.. మేల్కొండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి" అనే ఆయన పిలుపు నేటికీ యువత హృదయాలను కదిలిస్తోంది. "గొర్రెల్లా కాక సింహాల్లా బతకండి" అన్న ఆయన వాక్యం భారత యువతకు ధైర్యాన్ని నూరిపోసింది. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, లోకమాన్య తిలక్ వంటి మహానాయకులు వివేకానందుడిని తమ ఆదర్శంగా పేర్కొన్నారు. "భారతదేశాన్ని తెలుసుకోవాలంటే స్వామి వివేకానందుడిని చదవండి" అన్న టాగోర్ వ్యాఖ్య ఆయన ప్రభావాన్ని చాటుతోంది.

1902 జూలై 4న, కేవలం 39 యేళ్ల వయసులో, శిష్యులకు బోధనలు ఇచ్చిన తరువాత యథాస్థితిగా మహాసమాధి పొందాడు. తక్కువ జీవితకాలంలోనే శతాబ్దాల పాటు చెరిగిపోని ముద్ర వేసిన మహనీయుడు ఆయన.

భారత ప్రభుత్వం 1994లో ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటించడం ఆయన సేవలకు లభించిన గౌరవం.

వివేకానందుడి సూక్తులు నేటికీ జీవన మార్గదర్శకాలు. "మందలో ఉండకు.. వందలో ఉండేందుకు ప్రయత్నించు", "ప్రయత్నం చేసి ఓడిపో! కానీ ప్రయత్నం చేయడంలో ఓడిపోకు", "మతం ఆచరణలోనే ఉంది" వంటి వాక్యాలు మనసులను దృఢపరుస్తాయి. జీవితం నిరాశతో నిండినప్పుడు, భయాలు వెంటాడినప్పుడు, వివేకానందుని ఆలోచనలు మనకు దారి చూపుతాయి. నిద్రాణమైన భారత జాతిని మేల్కొలిపిన యుగపురుషుడు స్వామి వివేకానందుడు. ఆయన ఆలోచనలు, ఆచరణలు, ఆశయాలు యుగయుగాల పాటు భారత హృదయంలో చిరస్థాయిగా నిలిచే ఉంటాయి.

**– రామకిష్టయ్య సంగనభట్ల**

– నీ రహస్యాన్ని గాలికి చెప్పావనుకో, అది చెట్లకు చెప్పవచ్చు. – ఖలీల్ జిబ్రాన్

– ఒక రహస్యాన్ని ముగ్గురైనా దాచగలరు. అందులో ఇద్దరు చనిపోయిన తర్వాత – బెంజమిన్ ఫ్రాంక్లిన్

– అందమైన అబద్ధాన్ని చెప్పేవాడే కవి. – ప్లేటో

**హాస్యకథ**

# సరాగాలు

**వడలి రాధాకృష్ణ**


**బాజా భజంత్రీలు అక్కడ మోత ఎక్కించేస్తున్నాయి! వారి పాటలు వీధి చివర పిల్ల కాలువ గట్టు దాకా వినిపిస్తూ ఉన్నాయి. దానితో భయ్యారావు మావయ్య ఇల్లు పట్టుకోవడం పెద్ద కష్టం కాలేదు గవరశాస్త్రికి.**

ఇల్లు పట్టుకోవడం ఎలాగో అని మొదట్లో వాపోయాడు. కానీ కొండను తవ్వాల్సిన పని లేకుండానే ఎలుకని పట్టేశాడు.

"అటు పోనీవయ్యా!" ఆటో డ్రైవర్‌ని హుంకరించాడు.

"చూసుకుని మరీ దిగండి. ఒకే వీధిలో రెండు మూడు శుభకార్యాలు జరిగిన సందర్భాలు తెలుసు నాకు.."

భార్యవైపు అదోలా చూశాడు గవరశాస్త్రి. పెనిమిటి హుంకరింపులకు, గాండ్రింపులకు బెసగలేదు సరికదా, బెట్టును సడలించలేదు ఆమె.



గవరశాస్త్రి తనదైన జాతి అతిశయాన్ని తొక్కిపెట్టక తప్పింది కాదు. "వెనకటి సిద్ధాంతంలోని రాద్ధాంతం వారి వీధిలో ఒకే ముహూర్తానికి అరడజనను పెళ్లిళ్లు జరిగాయి. అన్నీ పక్క పక్క ఇళ్లు కావడంతో తాటాకు పందిళ్లు అన్నీ కలిసిపోయాయి. లైటింగ్ సరే సరి. అరడజను పెళ్లిళ్లకి అప్పనంగా లైటింగ్‌లకు కరెంట్‌ను తీగల మీద లాగేసరికి ఇక చూస్కోండి.. ట్రాన్స్ ఫారం పేలిపోయింది. బాక్స్‌లు బద్దలయి" పోయాయి.

ఇక సన్నాయి మేళాల స్వరాలకు పొంతన లేకపోయినా, అనివార్యంగా కలగలిసేసరికి పెళ్లినాదాలు అన్నీ మంగళకరాన్ని కోల్పోయి చావు బాజాల్లాగా అన్పించాయి...

ఫక్కున నవ్వింది గన్నువేణి.

గవరశాస్త్రి ఒక్కసారిగా భార్య మీద ఉరిమాడు. అంతే..! తమ జాతికున్న అతిశయం మరోసారి ఎలుగెత్తుతూ ఉంది.

"పెళ్ళికని వెళ్లి అక్కడ అగ్గారావు అన్నయ్యగారిల్లు పట్టుకోవడం వల్లగాక తలప్రాణం వచ్చి తుంటిలో చేరిపోయింది?"

భార్య పరాచికానికి అన్నదో, మాటవరసకే అన్నదోగాని గవరశాస్త్రికి అర్థంగాక అయోమయం వచ్చి చుట్టేస్తూ ఉంది.

ఎలాగన్నా భార్య గన్నువేణి మాటలు గన్ నుండి ఊడిపడుతున్న తూటాలలాగా అన్పించాయి. అర్థాన్ని వెతుక్కోక తప్పడం లేదు. లేకపోతే పేరులోని గన్నును బయటకు తీస్తుంది. అందుకే కాసింత చల్లబడి ఎప్పటిలాగానే ఇప్పుడూ సరిపెట్టుకుంటూ ఉన్నాడు.

"ఊరుకో! అయినా ఈ అగ్రహారంలో ఏ పందిరి దగ్గర దిగితే అదే మన వాళ్ళ ఇల్లు" ఏదో గొప్ప జోక్ పేల్చినట్టు ఖంగున నవ్వాడు.

"శుభముహూర్తానికి వస్తే ఎవరు కాదు పొమ్మంటారు. చెప్పండి! పోతే మంచి అన్పించుకొని, మంచిమాట కానిచ్చుకొని బయట పడతామంతే!"

"అలా చేస్తే మా భయ్యారావు మావ కొరడా తీస్తాడు"

"కంగారు ఏమీ లేదు. ఇప్పుడు ఉన్నది ఒకటే వడక ముహూర్తం. ఆటో దిగగానే మన బంధు ఘటాలు మన కళ్లబడకపోతారా..

మావయ్య కట్టిన తాటాకు పందిరి గడప తొక్కకపోతామా.."

"గవరశాస్త్రి మావయ్య వచ్చాడ్రో!" వడక పందిట్లోంచి పడమల మూర్తి ముందు ఈలలా..! ఆ తర్వాత కేక గట్టిగానే వేశాడు. అది మామూలు కేకలాగా లేదు. గాండ్రు కేకలాగా ఉంది. ఆ కేకకి ఉలిక్కిపడ్డారో, లేక జడుసుకున్నారోగానీ సన్నాయి వాయిస్తున్న బృందం అంతా చటుక్కున వాయించడం ఆపేశారు. ఆ పైన ఆయోమయంగా సర్వదిక్కులూ చూస్తూ ఉన్నారు.

"గవరశాస్త్రి మావయ్య వచ్చాడు. గన్నువేణి అత్తయ్యా చాలా కాలం

తర్వాత దిగిపోయింది!" ఆనందం ఆపుకోలేని పడమల మూర్తి వచ్చి అమాంతం గవరశాస్త్రిని కౌగిలించుకున్నాడు. ఆ దృశ్యాన్ని ఫొటోగ్రాఫర్ తన కెమెరాలో క్లిక్ మనిపించాడు.

"అవును. ఇది భయ్యా మావ ఇల్లే!" గవరశాస్త్రి నిర్ధారణకు వచ్చేశాడు.

"పరామర్శలు ఆపి, ఆటో అబ్బాయికి డబ్బులిచ్చి పంపుతారా లేదా!" మొండి మొగుడు మీద కొంటె పెళ్లాంలా అంతెత్తున లేచింది గన్నువేణి. అవి పడి లేచినట్లు మాటలు లాగ లేవు. తన మీద మాటల గన్ను ఎక్కుపెట్టినట్లున్నాయి.

"బాగున్నావా అత్తయ్యా! మేనల్లుడి ఉపనయనానికి ఇప్పుడా వచ్చేది!!" పడవల మూర్తి జీవిత అర్ధాంగి పవిత్రలక్ష్మి గన్నువేణి చేతుల్ని పట్టుకుని అదే పనిగా కుదిపేస్తూ అంది.

ఆ వీర దృశ్యాన్ని ఫొటోగ్రాఫర్ తన కెమెరాలో క్లిక్‌మనిపించాడు.

"ఇక వదిలేది ఏమయినా ఉందా లేదా!" విడివడడానికి విశ్వప్రయత్నం చేస్తోంది గన్నువేణి.

"ఏరా అబ్బాయ్! పందిట్లో మన వాళ్లెవ్వరూ కన్పించరే!" ఖాళీగా ఉన్న కుర్చీలను లెక్కపెడుతూ అన్నాడు గవరశాస్త్రి.

అదే సమయంలో బుర్రిరాజు తన కొడుకు ఉపనయన కార్యక్రమాన్ని బంధుగణం ఎవరినీ పిలవకుండా కానిచ్చేస్తున్నాడనే అనుమానం కూడా వచ్చేసింది.

"లేదు మామయ్యా! టిఫిన్ సెక్షన్ మొదలు అయింది"

ముహూర్తాన్ని మూలకు నెట్టేసి అంతా పెరట్లోకి పరుగు తీశారు"

"తినక తప్పుతుందా! ఆపైన బీపీ, షుగర్ టాబ్లెట్లు మింగకా తప్పుతుందా!!"

"అలా పరుగు పెట్టమాక! బోర్లా పడగలవు. ముందు సామాన్ల సంగతి చూడు" భార్యను వారింపబోయాడు శాస్త్రి.

"సామాన్లు ఎక్కడికి పోతాయి! ఆలస్యం చేస్తే పెరటి పందిరిలో ఉప్మా గిన్నెలు నిండుకుంటాయి!!" అటుగా అడుగులు వేస్తూ అంటోంది గన్నువేణి. అది నడకలా లేదు. పరుగులా ఉంది.

"బాబయ్య గారు వచ్చేశారు!" పెరటి పందిట్లో కుడి చేతితో ఆరగిస్తున్న ఉప్మా ప్లేటును పట్టుకొని, ఎడమ చేతితో చేయి కలిపాడు సుఖరావు.

ఫొటోగ్రాఫర్ ఆగడం లేదు. దృశ్యాన్ని పొందికగా కెమెరాలో బంధించేస్తున్నాడు.

"నమస్కారమండీ!" భర్తతో కలిసి తానూ మాట కలిపేసింది సిరిమువ్వ.

"ఇదేనా రావడం!"

"అవునుగానీ.. మన బుర్రి రాజేడీ!"

"పీటల మీద కూర్చున్నాడు కదా! ఇప్పుడు కాసింత విరామం. ప్రతి సినిమాకు ఇంటర్వెల్ మామూలే కదండీ!!" పెద్ద జోక్ పేల్చినట్లు ఫీలై ఫక్కున నవ్వాడు సుఖరావు.

"బాబయ్యా వచ్చారా! చాలా సంతోషం!!" భువనకుమారి కూడా ఎదురొచ్చి స్వాగతం పలికింది.

"మీరు పిలిస్తే రాక ఛస్తామా... రాకపోతే ఛస్తాం కానీ!" అక్కడ పాత సినిమాలోని సుత్తి జంట డైలాగులు ఫెళఫెళ మంటున్నాయి. ఒకవేళ ఎండలు ఎక్కువ అని వంకపెట్టి రాకపోతే మా భయ్యారావు మావ నన్ను చీల్చి చెండాడేస్తాడు.

"ముందు టిఫిన్లు కానీయండి!" భువనకుమారి అందరినీ కలుపుగోలుగా పలకరించి ముందుకు కదిలిపోయింది.

**"ఇదేనా రావడం!"**
**"అవునుగానీ.. మన బుర్రిరాజేడీ?"**
**"పీటల మీద కూర్చున్నాడు కదా! ఇప్పుడు కాసింత విరామం. ప్రతి సినిమాకు ఇంటర్వెల్ మామూలు కదండీ!" నవ్వుతూ అన్నాడు సుఖరావు.**

"అవునూ... ఒడక గుంటడు ఎక్కడా కనబడి చావడే!" శుభకార్యంలో చావు మాటలు భజంత్రీల సన్నాయి పాటలలో సన్నాయి నొక్కులు నొక్కుతూ కలగలిసిపోతున్నాయి.

"నాకొద్దు ...వా ...ఆ బోడిగుండు నా కొద్దు!" బబ్లూ ఎలుకపిల్లలాగా అటూ ఇటూ లగెత్తుతూ ఉన్నాడు. ఎవరికీ అందక, అందినట్లే అంది అంతలోనే చేజారిపోతూ, ఇంట్లోకీ బయటకీ అదే పనిగా మారాం చేస్తూ అందరి మధ్య నుండి దూరిపోతూ ఉన్నాడు.

"మా అమ్మవి కదూ! మహేష్‌బాబు సినిమా చూపించనా బబ్లూ!!"

"మహేష్‌బాబూ వద్దు.. బోడిగుండూ వద్దు. నాకు రామ్‌చరణ్ తేజ్ కావాలి, అమ్మ భువనకుమారి చేతికి చిక్కి చిక్కినట్లే చిక్కి చిరుగాలి కెరటం లాగ, మెరుపు వేగంతో తప్పించుకుంటూ అందరినీ తిప్పలు పెడుతున్నాడు"

"సంకల్పానికి కూర్చోవాలి! ముహూర్తం దగ్గర పడుతోంది. ఇప్పుడు చతురులు ఆడే సమయం కాదు. అందరికీ నవ్వులాటలాగ ఉంటే ఆయన మాట అరణ్యరోదనే అవుతోంది".

బబ్లూ బోడిగుండు గీయించుకోనని అరచి గీ పెడుతున్నాడు.

"ఇలా అయితే ఒడక లగ్నం ముహూర్తం ఈ రోజు పదిన్నరకు కాదు. రేపు పదిన్నర గంటలకు తెములుతుంది" ముక్కు పొడెం ఇచ్చిన కిక్కుతో యాగ్నీకం చేయించడానికి విచ్చేసిన పందిళ్లపల్లి పంతులు గారు మీడియోకి గొప్ప గొప్ప ఫోజులిచ్చేస్తూ అంటున్నారు.

టిఫిన్లు తినేవాళ్లు.. సుష్టుగా అక్కడ పదార్థాలను లాగించేసి తీరిగ్గా కూర్చొని వాట్సప్‌లు చూసుకొనేవారు.. ఫేస్‌బుక్‌లో అదేపనిగా పోస్టింగ్‌లు పెట్టేవారు.. అంతకు ముందు పెట్టిన పోస్టింగ్స్‌కి వచ్చిన లైక్స్ చూసుకొని మురిసిపోతూన్న మహాజనులు.. మొదలైనవారితో పందిరి అంతా కోలాహలాన్ని మించిపోయి హల్‌చల్ చేస్తూ ఉంది.



చెప్పాలంటే వడక పందిరి అంతా సందడే సందడి!

కానీ బబ్లూ ఎవరికీ చిక్కని చిట్టి కుందేలు పిల్ల అయిపోతున్నాడు.

"బొడ్డూడని వాడికి ఇప్పుడే వడక జందెం వేయకపోతే వచ్చిన నష్టమేమిటో మరి!" అన్ని సందర్భాలలోను నిత్యం రెబల్‌గా ఉండే జోగులు బామ్మ ఎలుగెత్తుతూ ఆడిపోసుకుంటోంది.

ఈ మధ్యనే ఐదారు సంవత్సరాల క్రితం జోగులమ్మ గారి ప్రియతమ పెనిమిటి అకారణంగా కాలం చేసుకుపోయినాడు. దానితో గంగా భాగీరథీ సమానురాలయిపోయింది. ఆ కారణంగా ఇన్నాళ్ళూ ఇంట్లో మొగుడు మీద ప్రయోగించిన నోటి ప్రతాపం, బంధుకోటి మీద ప్రదర్శిస్తూ ఉంది ఇప్పుడు.

ఈవిడగారి వల్లనో, లేక జోగులమ్మగారు నిత్యం పెట్టే గృహహింస కారణమో తెలవదుగాని, భూతల స్వర్గం కన్నా పైనున్న స్వర్గంలోనే కాసింత మనశ్శాంతి ఉండగలదన్న భావనతో అటుగా ఎగిరిపోయాడు ఆయన.

పిల్లా పీచూ అంటూ ఎవరూ లేని జోగులమ్మ భయ్యారావుకి అక్కడెక్కడో వేలు విడిచేసిన సిస్టర్ వరస కావడంతో ఇంటిల్లిపాదికి తన మేనత్త వరస అయి కూర్చుంది. ఒకవేళ వారి వారి ఇళ్లలో జరిగే వేడుకలకు పిలిచినా పిలవకపోయినా, గాలికబురు చెవికి సోకినా వచ్చి వాలిపోతోంది. అందుకే పిలవకుండా అభాసుపాలు కావడం ఎందుకని అందరూ జోగులు అత్తమ్మను ముందుగానే ఆహ్వానించేస్తున్నారు.

"భయ్యారావు బాబయ్య కుటుంబమంటే మడిదడులతో నిప్పును ఒంటికి పులుముకొనే బేపన కుటుంబం. ఈ రోజుల్లో అంతా అయినవారు ఎవరున్నారు, చెప్పండి!" పడవల మూర్తి అదేపనిగా అయ్య భయ్యారావుకి, కుయ్య బుర్రిరాజుకి కితాబులు ఇచ్చిపారేస్తున్నాడు.

"నేను దొరకను.. నేను కూర్చోను.. బోడిగుండు వద్దుగాక వద్దు!!" వటువు వడక పందిట్లో అదే పనిగా ఏడుపు లంకించుకుంటూ ఉన్నాడు. ఎవరి చేతికీ చిక్కని చురుకైన కోడిపుంజు అయిపోతున్నాడు. పట్టుకొని గంప కింద కప్పెట్టేద్దామని ఎవరు ప్రయత్నించినా, ఎంత కష్టపడినా రెక్కలు విదిల్చిన కోడి పుంజులాగ ఎగిరెగిరి పడుతూనే ఉన్నాడు. అదే ఎవరు పట్టుకుందామన్నా దొరకక పరుగులు లంకించుకుంటూ ఉన్నాడు. "నా కన్నవి కదరా! ఇప్పుడు బుల్లి పెళ్లికొడుకువి. రేపు బాగా పెద్దయ్యాక పెద్ద పెళ్లికొడుకువీను!!" మనవణ్ణి పట్టుకొని మురిపెంగా ఎత్తుకొని బామ్మ బాలామణి బుజ్జగిస్తూ ఉంది.

"హేయ్ భడవా! కూర్చోరా.. ఎందుకు కూర్చోవంట" తెల్లవారు జాము నుండి క్షణం తీరిక లేకుండా మనవడి ఉపనయన వేడుకలలో తలమునకలైపోయి ఉన్న భయ్యారావు గట్టిగా గదిమాడు.

"వా...! మమ్మీ, తాతగారు తిడుతున్నారు." బబ్లూ ఏడుపును సాగదీస్తూ ఉన్నాడు. ఏడవడమే కాదు, ఒక్కసారిగా పందిట్లోని అందరి సింపతీని కొట్టేస్తున్నాడు.

"కుర్రాడికి ఏదో సర్ది చెప్పి, బుజ్జగించి పని కానివ్వాలిగానీ, అన్ని వేళలా అరుపులు కేకలు అక్కర కొస్తాయా" రౌతు రామ్మూర్తి కాసింత అసహనాన్ని ప్రదర్శించి కుర్రాడిని సముదాయించడానికి ప్రయత్నిస్తున్నాడు. "మీరు ఉండండి! ఇటురా నాన్నా!! మా బబ్లూ మంచివాడు ఏడవచ్చా!! అందరూ నవ్వుతారు" రౌతు రామ్మూర్తి గారి భార్య రాతిరి రమ్య వాడిని ఒడిలో కూర్చోపెట్టుకొని చెవిలో ఏవేవో చెబుతూ ఉంది. బ్యాగ్‌లోంచి నేచురల్ కూల్‌డ్రింక్ తీసి ఇవ్వబోయింది. "వటుడు ఈరోజు ఉపవాసం ఉండాలి! అన్నీ పట్టుమని పట్టించేయకూడదు. మెడలో జందెం పడేదాకా పచ్చి మంచినీళ్ల కూడా ముట్టకూడదని శాస్త్రం గట్టిగా చెబుతోంది" బ్రహ్మస్థానంలో కూర్చున్న పందిళ్లపల్లి పంతులుగారు గట్టిగానే హెచ్చరించారు.

"బాగుంది వరుస! ఒళ్లు కాలి ఒకడు ఏడుస్తూంటే..!!" దూరాన కూర్చున్న సుఖరావు తన మాటల ప్రావీణ్యతను అందరికీ వినబడేలా ప్రదర్శిస్తూ ఉన్నాడు. "ఉరుకోండి! మా బుర్రిరాజు అన్నయ్య కుటుంబం అంటే ఏమనుకున్నారు. ఊరిలో గొప్ప కుటుంబం వాళ్లది. రోజూ మడిదడులతో దేవునికి మహా నైవేద్యం విస్తరి వేయకుండా ఎవరూ ఇంట్లో మెతుకు కూడా ముట్టరు తెలుసా!" సిరిమువ్వ కాసింత గొప్పగానే మొగుడి చెవిన వేస్తోంది. ఇంత బొడ్డూడని బుడ్డోడికి అప్పుడే వడక జందెం వేయకపోతే వచ్చిన నష్టం ఏమిటో!"

"చాల్లే ఊరుకోండి.. బేపన పుట్టుక పుట్టి అందరూ మీలాగ అఘోరిస్తారా ఏమిటి!"

"తమరికి ముప్పై అయిదో ఏట పెళ్లి! పెళ్లికి ముందు రోజు వడక లగ్నమూను".

"అంతా నీ అదృష్టం! ఒకరి అదృష్టం ఒకరికి అంటదుగానీ, పైకి అనమాకండి. భయ్యారావు మావ విన్నాడంటే భరతం పట్టేస్తాడు."

"జీలకర్రా, బెల్లం పెట్టడానికి వేళవుతోంది! వటువును కట్టేసేనయినా పట్టుకొచ్చి పీటల మీద పడేయండి. పందిళ్లపల్లి పంతులుగారు ఉన్నట్టుండి హుకుం జారీ చేస్తున్నారు.

"కొడుకు ఉపనయనం మడిదడులతో శాస్త్రోక్తంగా జరిపిస్తారని బుర్రిరాజు బావ పందిళ్లపల్లి పంతుల్ని పదివేల నూటపదహార్లు ఇచ్చి మరీ పిలిపించినాడు తెలుసా!"

"ఎక్కడమ్మా! ఈ కుర్రకుంక చేతికి లొంగితే కదా! నేను కూర్చోను. కూర్చోనంటూ కోడిపుంజు మాదిరి అటూ ఇటూ తెగ పరుగులు తీస్తుంటేను"

గంప క్రింద కోడిపుంజును పెట్టి మూత పెట్టడానికా అన్నట్లు భువనకుమారి కొడుకు కోసం విశ్వప్రయత్నం చేస్తూ ఉంది. వాడు అమ్మకు దొరకడం లేదు, నాన్నకు లొంగడం లేదు. చిక్కినట్లే చిక్కి తప్పించుకొని పారిపోతున్నాడు. వాడికి నచ్చచెప్పడం ఎవరివల్లా కావడం లేదు. మడిగా పీటల మీద కూర్చోవలసినవాడు అందర్నీ ముట్టేసుకుంటూ, కట్టిన బుల్లి పంచె ఊడిపోతున్నా, మనుషుల మధ్య నుండి నెట్టేసుకుంటూ పోతున్నాడు. చివరికి సన్నాయి మేళగాళ్ల మధ్య నుండి కూడా దూసుకుపోతున్నాడు.

ఎలుకపిల్లలాగా అటూ ఇటూ పరుగులు తీస్తూన్న బబ్లూ తమ సారును చూసి చప్పబడిపోయాడు. అమాంతం సారు రెండు కాళ్లను చుట్టేశాడు. తన కెంతో ఇష్టమైన సారు చెవిలో గుసగుసలాడుతున్నాడు. బుల్లోడి మాటలు దేవదానం గారికి నవ్వు తెప్పిస్తున్నాయి.

జోగులమ్మతో సహా అనేకమంది దెప్పిపొడుస్తున్నారు. భయ్యారావు కేకలు వేస్తూ ఉన్నాడు. బాలామణి సర్ది చెబుతోంది. బబ్లూ వినిపించుకునే పరిస్థితిలో లేడు.

"ఈ ముహూర్తానికి జీలకర్ర, బెల్లం నెత్తి మీద పడగలదన్న నమ్మకం కుదరడం లేదు. ఊరిలో పెద్ద పంతులు గారింట్లో ముహూర్తం మురిగిపోయిందంటే ఎంత నామార్దా!" పందిళ్ల పల్లి పంతులు గారి మాటలు పందిరిని దాటిపోతున్నాయి. విషయం చిలికి చిలికి గాలివాన అయిపోతోంది.

"ఏమయింది బుర్రీ!" అప్పుడే పందిట్లోకి అడుగుపెట్టిన దేవదానం మాస్టారుకి విషయం అర్థం కావడం లేదు. దేవదానం మాస్టారు ఊరి ఎలిమెంటరీ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బబ్లూ గాడికి క్లాసు టీచరు.

ఎలుకపిల్లలాగా అటూ ఇటూ పరుగులు తీస్తూన్న బబ్లూ తమ సారును చూసి చప్పబడిపోయాడు. అమాంతం సారు రెండు కాళ్లను చుట్టేశాడు.

తనకెంతో ఇష్టమైన సారు చెవిలో గుసగుసలాడుతున్నాడు. బుల్లోడి మాటలు దేవదానం గారికి నవ్వు తెప్పిస్తున్నాయి. "గుండు గీయించుకున్నావనుకో రేపు నీకు పరీక్షల్లో నీకు గంపెడు మార్కులు వచ్చేస్తాయి. నీ ఇష్టం.. నేను చెప్పినట్లు వినినావనుకో రేపు ఆదివారం మన స్కూలుకు సెలవు.. మనమందరం రామ్‌చరణ్ సినిమాకు చెక్కేస్తాం ..." వాడిని దగ్గరకు తీసుకుంటూ బుజ్జగిస్తున్నారు.

"నిజంగానా టీచర్!" బబ్లూ నవ్వుతున్నాడు. పడిపడి మరీ నవ్వుతున్నాడు. అంతవరకు అదే పనిగా ఏడ్చిన అతగాడి మొహంలోకి నవ్వుకళ వచ్చేస్తూ ఉంది. మబ్బులను చీల్చుకుని ఉదయిస్తున్న బాలభానుడు అగుపిస్తున్నాడు. దేవదానం మాస్టారి మాటలకు వంత పాడుతున్నాడు.

"బావుంది చోద్యం.. మడులు.. దడులు అన్నీ మంట కలిసిపోతున్నాయి" పందిట్లోని పెద్ద తలకాయలలో గుసగుసలు ప్రారంభమయిపోతున్నాయి.

దేవదానం మాస్టారు తన విద్యార్థిని బుజ్జగిస్తున్నాడు. ఆయన మాటల్ని అతగాడు బుర్రకెక్కించుకుంటున్నాడు. బబ్లూని దగ్గర తీసుకుని సముదాయిస్తూంటే 'అంటరాని' అనే మాట అటకెక్కిపోతూ ఉంది.

"ఈ బాబు భలే మంచోడు! రేపు ఆదివారం సినిమాకెళ్తాం. ప్రస్తుతం మీరు పని కానీయండి!!" దేవదానం గారు శాస్త్రిగారిని అభ్యర్థిస్తున్నారు. బబ్లూ పకపకా నవ్వుతున్నాడు. లోకం తెలియని వాడి కళ్లు మిలమిలా మెరుస్తున్నాయి. చెప్పాలంటే మనిషి తన చుట్టూ అల్లుకున్న మడీ దడీ, కులం, గోత్రం ఇత్యాదులన్నీ లుప్తమైన వాస్తవాలుగా మిగిలిపోతున్నాయి.

పందిళ్లపల్లి పంతులుగారి యాగ్నీకం సజావుగా సాగిపోతోంది. అక్కడ దశ్యాన్ని వెనకేసుకొస్తూన్న వాళ్లున్నారు.. వెనకేసుకురానివాళ్లూ అధిక సంఖ్యలోనే ఉన్నారు. అందరి బుర్రల్లోనూ అనేకమైన సామాజిక పరమైన ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అంతలోనే కనుమరుగయిపోతూ ఉన్నాయి. దేవదానం సారు బుజ్జగించి ఆదేశించినాక బుద్ధిగా చెప్పిన మాట విని పీటల మీద కూర్చున్నాడు బబ్లూ.

ప్రేమగా వాడికి దగ్గరకు జరిగి క్రతువుకు సహకరిస్తున్నారాయన. పంతులు గారికి విషయం మింగుడు పడకుండా ఉంది. ముహూర్తం వేళ బుర్రిరాజు, భువనకుమారిలు కొడుకు తలమీద శాస్త్రోక్తంగా జీలకర్ర, బెల్లం పెడుతున్నాడు. పురోహితుల మంత్రాలు మిన్నంటుతున్నాయి.

ఫొటోగ్రాఫర్ అన్ని దృశ్యాలను కెమెరాలో బంధిస్తున్నాడు. తర్వాత పంతులుగారు చెప్పినట్లు ఒంటిపేట జందెం పోగును జన్మనిచ్చిన తల్లిదండ్రులు వాడికి వేసేశారు. సన్నాయిమేళం మంగళకరమైన రాగాలను శాస్త్రీయంగా ఆలపిస్తూ ఉన్నారు. వారికి ఎంతో సంతృప్తిగా అన్పిస్తోంది. తన సారు చేతిని గట్టిగా పట్టుకుని కూర్చున్న బాలుడు పకపకా నవ్వుతున్నాడు. దేవదానం గారికి చాలా సంతృప్తిగా అన్పిస్తోంది. వాడి కేరింతలు పందిట్లో ఆనందాలను విరజిమ్ముతున్నాయి.

"లౌకికాలు.. అలౌకికాలు" రెండూ కలగలిసిపోయి ఇప్పుడు కొత్తగా "ఓ జీవన మకుటాన్ని" ఆవిష్కరిస్తూ ఉన్నాయి.

భజంత్రీలు స్వరయుక్తంగా మేళం చేస్తున్నారు! పందిరి అంతా ప్రామాణికమై అలరారుతూ ఉంది!! అంటు పడిపోయిందన్న "వర్ణ వాస్తవం" ఒక్కసారిగా ఆ మేళ ధ్వనులలో నిక్షిప్తమైపోయినట్లుంది ఇప్పుడు.

# టిబెట్ ప్రజల బౌద్ధ ధర్మకేంద్రం 'ధర్మశాల'

**హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల భారతదేశంలోని ఒక అద్భుతమైన పర్వత పర్యాటక కేంద్రం. ఇది టిబెట్ ప్రజల బౌద్ధ ధర్మానికి కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచింది. ధర్మశాల కాంగ్రా జిల్లాలో ఉంది. బ్రిటిషువారి కాలంలో ఇది ఒక హిల్ స్టేషన్‌గా అభివృద్ధి చెందింది. దాని ప్రకృతి సౌందర్యం, బౌద్ధ సాంస్కృతిక వైభవం, హిమాలయాల దృశ్యాలతో ప్రసిద్ధి చెందింది.**



ధర్మశాల హిమాలయ పర్వతాలలో సుమారు 1,457 మీటర్ల ఎత్తులో ఉంది. చుట్టూ మంచుతో కప్పబడి ఉన్న దౌలాధార్ పర్వత శ్రేణులు, పచ్చని అడవులు, చల్లని వాతావరణం దీని ప్రత్యేకత. గతంలో దీన్ని బాగ్సు అని పిలిచేవారు. దలైలామా నివాస స్థలమైన ధర్మశాల శాంతి సామరస్యాలకు, ఆధ్యాత్మికతకు నిలయం. 1959లో చైనా ఆక్రమణ తర్వాత దలైలామా, టిబెట్ శరణార్థులు ఇక్కడ స్థిరపడ్డారు.

దలైలామా ఇక్కడ 1960 నుండి నివసిస్తున్నారు. అందువల్ల దీనిని తరచుగా 'లిటిల్ లాసా' అని కూడా పిలుస్తారు. ఆధ్యాత్మిక బోధనలు, ఆచారాలతో భాసిల్లే ఈ ప్రాంతం టిబెట్ సంస్కృతిని మిళితం చేసుకొంది. దాదాపు మూడు వేల మంది టిబెట్ ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో ప్రధాన నగరమైన ఈ ప్రదేశం ఎన్నో అందాలను తనలో ఇముడ్చుకుంది. అంబరాన్ని చుంబించే శిఖరాలు, కొండల నుండి జాలువారే జలపాతాలు, మంచు దుప్పట్లను కప్పుకున్న సాల్, పైన్ వృక్షాలు, దేవదార్ అడవులు, పచ్చని కొండలు, మంచుతెరలను చీల్చుకుంటూ వచ్చే లేత కిరణాల వెలుగులు, ఇంద్రధనుస్సులను చిత్రించిన అందమైన రంగుల కాన్వాస్‌లాగా కనిపించే ఈ ప్రాంతం మధురానుభూతికి లోనుచేస్తుంది. ధర్మశాలకు మూడు వైపులా ఎత్తయిన శిఖరాలు కనిపిస్తాయి. హిమాలయాల దౌలాధర్ శ్రేణిని ఇక్కడి నుండి కనుచూపుమేర చూడవచ్చు. ధర్మశాల ప్రాంతం పవిత్రతకు ప్రసిద్ధి. 18వ శతాబ్దం వరకు ఈ ప్రాంతం సంసార్ చంద్ అనే రాజు పాలనలో ఉండేదని చరిత్ర చెబుతోంది. అందుకు సాక్ష్యంగా ఇక్కడ పురాతన కోటలు, ఆలయాలు మనకు దర్శనమిస్తాయి. హిమాచల్‌ప్రదేశ్ పర్యటనకు వచ్చినవారు తప్పకుండా చూడాల్సి ప్రదేశమిది. 1905 భూకంపం వల్ల నామరూపాల్లేకుండా పోయిన ఈ ప్రాంతం ఇప్పుడు ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతున్నది. ధర్మశాలను 'స్కాట్లాండ్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు.

1815-1847 కాలంలో బ్రిటిష్ వారు సూర్యుని తాపం నుండి తట్టుకునేందుకు వేసవి విడిదిగా భావించిన ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందింది ధర్మశాల. ఈ ప్రాంతాన్ని ఎక్కువ ధర్మశాల, దిగువ ధర్మశాల అని రెండు భాగాలుగా విభజించారు. దిగువ ధర్మశాలలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఎగువ ధర్మశాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నది. ఇక్కడ మెక్‌లియాడ్ గంజ్, ఫోర్సిత్ గంజ్‌లు చరిత్ర తాలూకు స్మృతి చిహ్నాలుగా అనిపిస్తాయి. దిగువ ధర్మశాల 1250 మీటర్ల ఎత్తులో ఉండగా, ఎగువ ధర్మశాల 1457 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ ప్రాంతం చుట్టూ దేవదార్ అడవులు వ్యాపించి ఉన్నాయి. ధర్మశాల ఒకప్పుడు గద్దీస్ అనే తెగ జాతులతో నిండి ఉండేది. బ్రిటిష ప్రభుత్వ తొలుత దీన్ని కంటోన్‌మెంట్‌గా చేసుకుంది. ఆ మీదట ఇది హిల్ రిసార్ట్‌గా మారింది. 1959లో కమ్యూనిస్టు చైనా టిబెట్‌పై దురాక్రమణ చేసినప్పుడు శరణార్థిగా వచ్చిన 14వ దలైలామాకు ఆశ్రయం ఇచ్చిన ప్రాంతం ఈ ధర్మశాల, అప్పట్లో టిబెట్ శరణార్థులతో ఈ ప్రాంతం నిండి ఉండేది.

మెరూన్ వర్ణ దుస్తులతో కనిపించే బౌద్ధ భిక్షువులు, ప్రార్థన చక్రాలను తిప్పుతూ కనిపించే వృద్ధ స్త్రీలు, టిబెట్ వస్తువులను విక్రయించే దుకాణాలు.. ఇత్యాదివి మనం టిబెట్‌లో ఉన్నామా? అనే భ్రమను కలిగిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కొత్వాలి బజార్, కచ్చేరి, మెక్లియోడ్ గంజ్ అనే మూడు చిన్న పట్టణాల కలయికే ఈ ధర్మశాల..

మక్లియోడ్ గంజ్ ధర్మశాలకి సమీపంలోని ప్రసిద్ధ ప్రాంతం. దలైలామా నివాసం ఇక్కడే ఉంది. భాగ్సు జలపాతం, డాల్ సరస్సు, కాంగ్రా కోట, టిబెటిన్ల కళల సంరక్షణ కేంద్రం నోర్బులింగా ఇన్‌స్టిట్యూట్, ట్రెక్కింగ్‌కి ప్రసిద్ధిగాంచిన ట్రియుండ్ ట్రెక్ ఇత్యాది అనేక పర్యాటక ప్రదేశాలు మక్లియోడ్ గంజ్ ప్రసిద్ధి చెందింది. సెప్టెంబర్-నవంబర్ వరకు; మార్చి-జూన్ ధర్మశాలను పర్యటించడానికి ఉత్తమ కాలం.



## మక్లిలియోడ్ గంజ్

ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద భవనాలు, రెస్టారెంట్లు, టిబెట్ అధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. అప్పట్లో దలైలామా నివాసమున్న న్యామ్‌గల్ మోనాస్టరీ ఉంది. దలైలామా నివసించే ఆవాసానికి ఎదురుగా బోద్ధ దేవళం కాలచక్ర ఆలయం కనిపిస్తుంది. గంజ్‌కు ఒక కి.మీ దూరంలో టిబెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ కేంద్రంలో టిబెట్ సంస్కృతిని తలపించే నాట్యం, కళలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. దీనికి దగ్గరలో టిబెట్ హస్తకళా సంపదను ప్రదర్శించే బజారు ఉంటుంది.

## హిమాచల్‌ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం

ఈ క్రికెట్ స్టేడియం నిర్మాణం 2003లో ప్రారంభమైంది. సుమారు 23,000 ప్రేక్షకులు ఇందులో కూర్చుని క్రికెట్ క్రీడను తిలకించవచ్చు. సముద్ర మట్టానికి సుమారు 1,457 మీటర్లు (4,780 అడుగులు) ఎత్తులో ఉంది. ఇది భారతదేశంలో అత్యంత ఎత్తైన అంతర్జాతీయ క్రికెట్ మైదానం. స్టేడియం చుట్టూ ఉన్న దౌలాధార్ పర్వత శ్రేణులు మంచుతో కప్పబడి ఉండటం వల్ల ఈ స్టేడియం ఎంతో అద్భుతంగా కనిపిస్తుంది. భారతదేశంలోని అత్యంత అందమైన క్రికెట్ మైదానాలలో ఒకటి.

**సమ్‌గ్యాల్ మోనాస్టరీ:** ఇది దలైలామా దేవాలయం. ఇక్కడ గౌతమ బుద్ధుడు, పద్మశాంభవ, అవలోకేటేశ్వర ప్రతిమలు ఉన్నాయి. హోమ సమయాలలో పర్యాటకులు ప్రదక్షిణలు చేయడానికి ఇందులోకి అనుమతిస్తారు.

**గ్యాంగ్‌చెన్ కిష్‌యోంగ్:** ఇక్కడ టిబెటన్ సాహిత్యపు లైబ్రరీ ఉంది. సమ్‌గ్యాల్ మోనాస్టరీ నుండి ఇరవై నిమిషాల ప్రయాణం. కిష్‌యోంగ్ కాంప్లెక్స్‌లోని ఒక విశేష భాగమే గ్యాంగ్ చెన్.



**భాగ్సు జలపాతాలు:** దిగువ ధర్మశాలకు 11 కి.మీ. దూరంలో భాగ్సు జలపాతాలు, పురాతన దేవాలయాలు ఉన్నాయి. ఇక్కడ రెస్టారెంట్లు సైతం ఉన్నాయి.

**సెయింట్ జాన్స్ చర్చి:** ఇండియాను పరిపాలించిన భారత వైస్రాయ్ లార్డ్ ఎలిగిన్ స్మారక కేంద్రమే ఈ చర్చి. మెక్‌లాండ్ గంజ్, ఫోర్సిత్ గంజ్‌కు 8 కి.మీ దూరంలో ఉంది.

**ధర్మకోట్:** ధర్మశాలకు 11 కి.మీ. దూరంలో ఉన్న ప్రాంతం పిక్నిక్ స్పాట్‌గా పేరొందింది. ఇక్కడి కంగ్రా లోయ, పాంగ్‌డాయ్ లేక్, దౌలాంధర్ శిఖరాలు కళ్లు మరల్చకుండా చేస్తాయి.

**ఖరేరి:** కొట్వాలి బజార్ నుండి 22 కి.మీ.దూరంలో వున్న ఈ ప్రాంతం రాత్రి విడిదికి అనువైన ప్రదేశం. ఇక్కడికి దగ్గర్లో సుందరమైన ఖరేరి కనిపిస్తుంది. దుర్వాస, కాళి ఆలయాలనూ సందర్శించవచ్చు.

**డెహ్రా గోపీపూర్:** తీరప్రాంతమైన ఈ ప్రదేశంలో పోంగ్‌డామ్, పాటన్, కుర్న్, నందూన్, డెహ్రాలు, మత్స్య కేంద్రాలు, బోటింగ్, ఫిషింగ్ హాబీ ఉన్నవారికి మధురానుభూతినిస్తుంది.

**నూర్పూరు:** ధర్మశాలకు అరవై కి.మీ. దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో అతిపురాతనమైన కోటలు, బ్రిజ్‌రాజ్ ఆలయం ఉంది. 1672లో మొఘల్ చక్రవర్తి జహంగీర్ తన భార్య నూర్జహాన్ జ్ఞాపకార్థం నూర్పూరుగా నామ కరణం చేశాడు. సందర్శకులకు అనువైన విడిది కేంద్రాలున్నాయి.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

> - ఇసుక రేణువులలో ప్రపంచాన్ని, అడవి పువ్వులో స్వర్గాన్ని, అరచేతిలో అనంత దూరాన్ని, ఒక ఘడియలో అనంత కాలాన్ని చూడగలవారు ధన్యులు.
>
> - విలియం బ్లేక్

**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

సెల్: **9885446501/9885449458**



# "బాహ్యావినత ద్వారదోషం" అంటే ?

**ఎస్.మంజరి, నంద్యాల**

**ప్రశ్న: బాహ్య వినతద్వార దోషం గురించి వివరించగలరు.**

**జవాబు:** గృహానికి ఎంత మందం వున్న గోడలు కట్టినప్పటికీ, ఆ గోడలో అమర్చే ద్వారం, గోడకు మధ్య భాగంలోగానీ, వెనక అంచుకుగానీ రాకూడదు. గోడ వెలుపలి అంచుకు సమంగా వుండాలి. 'వడంబము' వేసి తలుపు 90 డిగ్రీలు నిటారుగా ఉన్నట్లు తప్పకుండా నిర్ధారణ చేసుకోవాలి. ఒకవేళ తలుపు నిటారుగా లేకుండా వెలుపలి వైపుకి వంగి వున్నట్లయితే 'బాహ్యావినత ద్వార దోషం' సంభవిస్తుంది. ఇలాంటి దోషం ఉన్న గృహంలో నివసించే యజమాని/ఆ కుటుంబ సభ్యులు ఆ గృహం నుండి చాలావరకు బయట గృహాల్లో నివసిస్తూ ఉంటారు. కానీ ఈ ఇంటికి వస్తూ పోతూ ఉంటారు. ఈ విధమైన వాస్తు దోషం మిగతా వాస్తు దోషాలతో కలిసి ఉన్నప్పుడు యజమానిగానీ, ఆ కుటుంబ సభ్యులుగానీ వక్రమార్గంలో (వ్యసనాలు॥) ఆ ఇంటికి దూరంగా నివసిస్తూ, అప్పుడప్పుడూ వస్తూ పోతుంటారు. ఈ దోషం వున్నా ఆ ఇంటికి మిగతా వాస్తు విశేషాలు కలిస్తే ఆ ఇంటి యజమాని/కుటుంబ సభ్యులుగానీ సక్రమ రీతిలో(ఉద్యోగ, వ్యాపార రీత్యా) ఇంటికి దూరంగా నివసించవలసి వచ్చినా వారు ధనాన్ని, సంపదను కూడబెడుతూ తమ కుటుంబానికి సహాయపడుతూ కుటుంబ సభ్యుల మన్ననకు పాత్రులయ్యే అవకాశం ఉంటుంది. అలాగని ఉద్దేశపూర్వకంగా ద్వార బంధాన్ని ఇలాంటి దోషంతో ప్రతిష్ఠించుకోకూడదు. ఏ గృహస్థుడైనా వ్యసనాలతో ఇంటికి దూరంగా ప్రవాసం ఉంటే- ఇలాంటి దోషం ఉన్నదేమోనని ప్రధాన ద్వార బంధాన్ని ఒకసారి పరీక్షించుకొని, దోషముంటే సవరించుకోవటం వలన సత్ఫలితాలు ఆశించవచ్చు.



**సి.వాసుదేవ్, కనిగిరి**

## మా ఇంటికొచ్చి వాస్తు చూస్తారా?

**ప్రశ్న: మా నాన్నగారికి మేం ఇద్దరం ఆడపిల్లలం, ఒక కొడుకు. మా నాన్నగారు నాలుగు సంవత్సరాల క్రితం ఇల్లు కట్టారు. అప్పటి నుండి సమస్యలు మొదలయ్యాయి. అందరికీ అనారోగ్య సమస్యలు, ఎప్పుడూ ఎవరో ఒకరు ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. మాకు పెళ్లిళ్లు అయినా ఇద్దరం భర్త, పిల్లలతో సహా పుట్టింట్లో ఉంటున్నాం. వేరే వెళ్లాలంటే వెళ్లలేకపోతున్నాం. ఒకసారి మా ఇల్లు చూడటానికి రావాలని కోరుతున్నాం.**

**జవాబు:** గృహానికి నైరుతి దోషాల వల్ల సాధారణంగా రకరకాల అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ఆ గృహంలో ఒకే వ్యక్తికి అనారోగ్య సమస్యలు పునరావృతం అవుతూ ఉండవచ్చు, గృహంలో ఉన్న వాళ్లలో ఒకరి తరువాత ఒకరు అనారోగ్యం బారిన పడుతూ ఉండవచ్చు. లేదా ఒకే వ్యక్తి దీర్ఘకాలం అనారోగ్యం బారిన పడి బాధ పడుతూ ఉండవచ్చు. దోషాల సమీకరణాలను బట్టి పరిస్థితుల్లో దోష తీవ్రతలో మార్పులు వస్తుంటాయి.

మీకు అనారోగ్య సమస్యలే కాకుండా మనస్తాపానికి సంబంధించిన అనేక సంఘటనలు జరిగినట్లుగా తెలుస్తున్నది. ఇటువంటి పరిస్థితుల్లో ఇంటిని చూపించుకుని దోషాలను సవరించుకొని మంచి ఫలితాలు పొందాలన్న మీ ఆలోచన మంచిది. మేం దేశమంతా తిరిగి వివిధ గృహాలు, ఫ్యాక్టరీలు, విద్యాలయాలు, వైద్యశాలలు, గృహ సముదాయాలు చూస్తూ వాస్తు సలహాలు ఇస్తుంటాం. ఇతర దోషాల వల్ల బాధలనుభవించే వాళ్లకు కూడా దోష నివారణ పద్ధతులను తెలియజేస్తుంటాం. మీరు మా ఆఫీసుకి ఫోన్ చేసి మీ గృహ వాస్తు చూపించుకోవడానికి 'అపాయింట్‌మెంట్' తీసుకుంటే మేం వచ్చి మీ ఇంటి వాస్తు చూడటానికి వీలుంటుంది.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు : ..........................................

పుట్టిన తేది : ..........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................

చిరునామా:..............................................

# గండబేరుండ నాణెం రహస్యం

**హిందూ** దేవీ దేవతల చిత్రాలు నాణాలపై ముద్రించటం అతి ప్రాచీనంగా మన హిందూదేశంలో ఉంది. 3వ శతాబ్దంలోనే కుషాణులు నాణాలపై హిందూ దేవీ దేవతల చిత్రాలను ముద్రించారు. ఆ తరువాత అతి ఎక్కువ స్థాయిలో నాణాలపై దేవీ దేవతల చిత్రాలు మాత్రం ముద్రించిన ఒకే ఒక హిందూ సామ్రాజ్యం విజయనగర సామ్రాజ్యం అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

విజయనగర సామ్రాజ్య చక్రవర్తులు ప్రముఖంగా బంగారు, వెండి నాణాలను ముద్రించారు. "దేశ భాషలందు తెలుగు లెస్స" అని కొనియాడిన శ్రీకృష్ణదేవరాయల పాలనా కాలంలో భాషా సారస్వతానికే కాదు, నాణేలకు కూడా స్వర్ణయుగమే! ఎందుకంటే, వీరి కాలంలో నాణాలన్నీ బంగారంతో తయారయినవే! వాటిపై ముద్రించిన చిత్రాలు అప్పటి ప్రజల ఆధ్యాత్మికతను, హిందూ మత ఉద్ధరణకు అద్దం పడతాయి. విజయనగర సామ్రాజ్య కాలంలో బంగారు నాణాలపై శ్రీ వేంకటేశ్వరుడు, గండబేరుండ పక్షి, బాలకృష్ణుడు, ఆంజనేయుడు, లక్ష్మీ నారాయణులు, శంఖ–చక్ర తిరునామాలు, పార్వతీ పరమేశ్వరులు, సీతారాములు, వినాయకుడు మొదలైన చిత్రాలను ముద్రించారు. వీటన్నిటిలో భిన్నమైనది గండబేరుండ నాణెం.



విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయల తరువాత 1529లో అతని సవతి తమ్ముడు అచ్యుతదేవరాయలు పాలనకు వచ్చాడు. అచ్యుతదేవరాయల కాలంలో ముద్రించిన ఈ నాణెంపై గండబేరుండ పక్షిబొమ్మ ఉంటుంది. ఇది రెండు తలలు కలిగిన గరుడ పక్షి. ఈ నాణెంపై నాలుగు ఏనుగులు ఉన్నాయి. ఈ గండబేరుండ పక్షి తన వాడియైన కాలి గోర్లతో దిగువున ఉన్న రెండు ఏనుగులను, రెండు గట్టి ముక్కులతో ఎగువన ఉన్న మరో రెండు ఏనుగులను పట్టుకుని ఉంటుంది. అంటే, ఈ గండబేరుండ పక్షి ఎంతో బలంగా ఉండే ఏనుగులను అదుపు చేస్తోందని మనం అర్థం చేసుకోవచ్చు. ఈ నాణెం ముద్రించటం వెనుక ఒక చారిత్రక విషయం దాగి ఉంది. విజయనగర సామ్రాజ్యాన్ని కబళించటానికి చుట్టూతా ముస్లిం రాజులు కాపు వేసి ఉన్నారు. ఆ రాజ్యాలు: గోల్కొండ, బీదర్, బీరార్, అహ్మద్ నగర్ రాజ్యాలు. ఏనుగుల వంటి బలిష్టమైన, మదమెక్కిన గజాల వంటి ముస్లిం పాలకులను ఈ గండబేరుండ పక్షిగా విజయనగర సామ్రాజ్యం కట్టడి చేయటంగా మనం అర్థం చేసుకోవచ్చు. శత్రురాజ్యాలు చుట్టూతా ఉంటే మనం ఎంత జాగ్రత్త వహించాలో ఈ నాణెం మనకు చెబుతోంది. ఐదు వందల సంవత్సరాల క్రితమే శత్రువును ఏ దృష్టితో చూడాలో మనకు బోధిస్తోంది. నేటి పాలకులు శత్రురాజ్యం పట్ల ఎట్లా వ్యవహరించాలో తెలుపుతోంది.

గండబేరుండ పక్షిరూపం మనకు హిందూ పౌరాణికాల ద్వారా తెలుస్తోంది. శ్రీమహా విష్ణువు తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించటానికి నరసింహావతారం ఎత్తి, దుష్టుడైన ప్రహ్లాదుని తండ్రి హిరణ్యకశ్యపుడిని చంపిన తరువాత ఉగ్ర నరసింహ అవతారంలో ఉన్న నృసింహస్వామి ఎంతకూ శాంతించకపోవటంతో దేవతలు శివుని వేడుకోగా–

శివుడు శరభ వేషంలో నరసింహుని చెంతకు వెళ్ళాడు. ఈ శరభ రూపం సగం పక్షిగా, సగం సింహంగా ఉంటుంది. శరభ రూపంలో శివుడు నరసింహుని శాంతింపచేయటానికి వెళ్ళగా నరసింహుని నుంచి రెండు తలలు గల గరుడపక్షి 'గండబేరుండ'గా ఉద్భవించింది. ఈ గండబేరుండ పక్షి ఎంతో శక్తివంతమైనది. పక్షి రూపమైనా ఎంతటి పెద్ద జంతువునైనా ఎదుర్కొంటుంది. ఆ గండబేరుండ పక్షిరూపాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారు విజయనగర సామ్రాజ్యాధీశులు. అందుకే అచ్యుత దేవరాయలు మదమెక్కిన ఏనుగుల వంటివైన ముస్లిం రాజ్యాలను ఎదుర్కొనటానికి అత్యంత మహిమ కలిగిన, శక్తి కలిగిన గండబేరుండ పక్షిరూపాన్ని ఆదర్శంగా తీసుకున్నారు. గండబేరుండ పక్షి నాలుగు ఏనుగులను తన కాలిగోళ్లతో, ముక్కులతో పట్టుకోవటం అంటే చుట్టూ ఉన్న ముస్లిం రాజులను ఎదుర్కోగలమనే సందేశం శత్రురాజులకు పంపినట్లే! అందుకే విజయనగర సామ్రాజ్య కాలం నాటి ఈ గండబేరుండ నాణెం ఇంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఎంతో గొప్పదైన మన దేశ చక్రవర్తుల పాలన ధర్మబద్ధంగా, హిందూ ధర్మ ప్రభోదకుల ఆధ్వర్యంలో నడచింది.

గండబేరుండ పక్షి నాలుగు ఏనుగులను అదుపు చేస్తున్న శిల్పకళారూపం మనకు బేలూరులో ఉన్న చెన్నకేశవ ఆలయంలో కనిపిస్తుంది. అనంతర కాలంలో గండబేరుండ పక్షి రూపాన్ని మైసూరు ఒడయార్ రాజులు తమ అధికార చిహ్నాంగా ఉంచుకున్నారు.

– కప్పగంతు వెంకట రమణమూర్తి

# మానసిక రోగుల కట్టడికి మార్గాలు..

ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కన్నా ఎక్కువగా, అంటే దాదాపు 12 శాతం ప్రజలు మానసిక ఆరోగ్య (మెంటల్ హెల్త్ డిసార్డర్స్) రుగ్మతలతో సతమతం అవుతున్నారనీ, దీని వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతూ, పేదరికం పెరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ, డబ్ల్యూహెచ్ఓ తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. 'ప్రపంచ ప్రస్తుత మానసిక ఆరోగ్యం (వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే)' అనే నివేదికతో పాటు 'మానసిక ఆరోగ్య అట్లాస్ 2024(మెంటల్ హెల్త్ అట్లాస్ 2024)' అనే పేరుతో తాజాగా విడుదలైన నివేదికల రూపంలో పలు గంభీరమైన మానసిక ప్రజారోగ్య అంశాలు బయట పడ్డాయి. మానసిక అనారోగ్యాలకు ప్రధాన కారణాలుగా ఆందోళన, నిరాశ విష వలయంలో చిక్కిన అభాగ్యులు, ముఖ్యంగా యువత, మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని నివేదిక బహిర్గతం చేయడం కొంత కలవరానికి కారణం అవుతున్నది.

## ప్రమాదకరంగా మారుతున్న మానసిక రుగ్మతలు

ప్రపంచ దేశాలు మానసిక అనారోగ్యాలకు సరైన సమాధానంగా పలు పథకాలు, పాలసీలు, నిధుల కేటాయింపు చేయడం కొనసాగుతున్నాయి. నేటి డిజిటల్ యుగపు జనాభాకు మానసిక ఆరోగ్య సవాళ్లు రోజురోజుకు పెరగడంతో సత్వరమే ప్రజారోగ్య పరిరక్షణకు పెట్టుబడులు పెంచడం వల్ల కుటుంబ పౌర సమాజ ఆరోగ్యం కుదుట పడుతుందని నివేదిక అంచనా వేస్తున్నది. మానసిక ఆరోగ్యంపై పెట్టుబడి అంటే ప్రజారోగ్యంపై పెట్టుబడి అని భావించాలని ఐరాస నివేదిక సారాంశంగా తెలుపుతున్నది. మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి కనీస మౌలిక హక్కు అని తెలుసుకోవాలి.

## మానసిక రుగ్మతలు ఎక్కువైతే..

మానసిక రుగ్మతలకు చికిత్స చేయకపోతే అవి ముదిరిపోయి చివరకు ఆత్మహత్యలు కూడా పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో 7.27 లక్షలు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఈ సమస్య యువతలో మరింత అధికంగా ఉన్నట్లు గమనించారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు 2030 అంచనాల ప్రకారం 2030 నాటికి కనీసం 33 శాతం వరకు ఆత్మహత్యలు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ప్రస్తుతం పరిణామాల అధ్యయనం ప్రకారం 12 శాతం వరకు మాత్రమే కట్టడి చేయగలిగే స్థాయికి చేరవచ్చని నివేదిక పేర్కొనడం అన్ని దేశాలకు ఒక హెచ్చరికను చేసినట్లు అవుతున్నది.



మానసిక అనారోగ్యాల వల్ల పరోక్షంగా కుటుంబాలపై ఆర్థిక భారం పడడం, ఆ వ్యక్తులు తమ వృత్తిపరమైన పనులను చేసుకోకపోవడంతో ఆయా కుటుంబాల్లో పేదరికం పెరగడం జరుగుతోంది.

## మానసిక ఆరోగ్య కేంద్రాల పట్ల అపోహలు

మానసిక రుగ్మతల చికిత్స, మానసిక రుగ్మతల పట్ల అపోహలు తొలగించడం, వీటికి కారణమైన మూలాలను వెతికి పట్టుకోవడం నిరంతరం జరగాలని నివేదిక సూచిస్తున్నది. గత దశాబ్ద కాలంగా ప్రభుత్వాలు కేటాయిస్తున్న మొత్తం ప్రజారోగ్య నిధుల్లో కేవలం 2 శాతం మాత్రమే మానసిక రుగ్మతల కట్టడికి వినియోగిస్తున్నట్లు గమనించారు. అమెరికా ఒక్కొక్కరిపై 65 డాలర్లు మానసిక రుగ్మతల కట్టడికి కేటాయిస్తే, అత్యల్ప ఆదాయ దేశాలు కేవలం సగటున తలసరి 0.04 డాలర్లు మాత్రమే కేటాయించడం సమస్య గంభీరతను స్పష్టం చేస్తున్నది. మానసిక వైద్యులను సంప్రదించడానికి మానసిక రోగులు ముందుకు రాకపోవడం పెద్ద సమస్యగా కనిపిస్తున్నది. అల్పాదాయ దేశాల్లో కేవలం 10 శాతం మానసిక రోగులు చికిత్సలు పొందగలుగుతున్నారని, అభివృద్ధి చెందిన దేశాల్లో 50 శాతం మానసిక రోగులు చికిత్సకు చొరవ చూపుతున్నట్లు గమనించారు. మానసిక ఆరోగ్య పరిరక్షణకు చిన్న పిల్లలు, పాఠశాలలు, కళాశాలల్లో మానసిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పవలసిన అవసరాన్ని గుర్తించాలని నివేదిక వివరిస్తున్నది. కొన్ని దేశాల్లో 2020లో 39 శాతం మాత్రమే మానసిక ఆరోగ్య కేంద్రాలు పని చేయగా, నేడు అవి 80 శాతం వరకు పెరగడం కొంత ఊరటను కలిగిస్తున్నది.

నేటి డిజిటల్ స్మార్ట్ సమాజంలో మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెట్టుబడులను భారీగా పెంచడం, అన్ని స్థాయిల్లో మానసిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పడం, చట్టబద్ధంగా మానసిక రోగులకు కనీస హక్కులు కల్పించడం, పౌర సమాజ ఆధార మానసిక ఆరోగ్య కేంద్రాల విస్తరణ, వ్యక్తి ఆధార మానసిక ఆరోగ్య భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని డబ్ల్యూహెచ్ఓ సూచిస్తున్నది.

ఈ హెచ్చరికలను పెడచెవిన పెడితే మానసిక ఆరోగ్య రుగ్మతలు విపత్తువలె మారి పౌర సమాజం, కుటుంబాలు అనారోగ్య అయోమయంలో మునిగి జీవితాలు ఆత్మహత్యల వరకు చేరవచ్చని తెలుసుకుందాం.. ఆత్మహత్యలు లేని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# గంగా-జముని తెహ్‌జీబ్ 'సౌ'భాగ్య నగరం

**కుతుబ్‌షాహీల** పాలనా కాలంలో సాహిత్య, సాంస్కృతిక రంగాలలో తెలంగాణ విశేషంగా అభివృద్ధి పొందింది. ముస్లిం పాలకులైనవారు తెలుగు భాష, సంస్కృతికి ఎనలేని సేవలు చేసారు. కుతుబ్‌షాహీల రాజ్యభాష పర్షియన్. వీరి కాలంలో ఉర్దూ, పర్షియన్, తెలుగు భాషలలో సాహిత్యం అభివృద్ధి చెందింది.

ఇబ్రహీం కులీకుతుబ్‌షా(1550-1580) తెలుగు, ఉర్దూ, పర్షియన్ భాషా కవులను పోషించాడు. అతని ఆస్థానంలో ఉండే తెలుగుకవులు ఇబ్రహీం మల్కీభ రాముడిగా కీర్తించారు. ప్రముఖ తెలుగు కవులు కందుకూరి రుద్రకవి, అద్దంకి గంగాధర కవి, పొన్నెగంటి తెలగనార్యుడు అతని ఆస్థానంలోని వారే. కందుకూరి రుద్రకవి 'సుగ్రీవ విజయం' తెలుగులో మొదటి యక్షగానం. నిరంకుశోపాఖ్యానం కూడా రచించాడు. ఇబ్రహీం కుతుబ్‌షా ఈ కవికి రెంటచింతల గ్రామాన్ని దానంగా ఇచ్చాడు. అద్దంకి గంగాధర కవి తపసీ సంవరణోపాఖ్యానం రచించి, ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితం యిచ్చాడు. పొన్నెగంటి తెలగనార్యుడు తెలుగులో మొదటి అచ్చ తెలుగు కావ్యం యయాతి చరిత్ర రచించాడు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో దక్కనీ ఉర్దూ, మాండలీక ఉర్దూ భాష ప్రారంభమైంది. తెలుగు, ఉర్దూ, పారశీక సాహిత్యం వెల్లివిరిసింది.

సుల్తాన్ మొహమ్మద్ కులీ కుతుబ్‌షా(1580-1612) ఉర్దూ, పారశీక భాషలలో కావ్యాలు రాసిన గొప్ప కవి. కుతుబ్ షాహీ వంశస్థులలో అయిదవ ప్రభువు అయిన మహమ్మద్ కులీ మత సామరస్యానికి ప్రతీకగా పేరు పొందాడు. తొలి ఉర్దూ గజల్ ప్రక్రియ కర్తగా 'కుల్లియత్ ఏ కుతుబ్ షాహీ' కవితా సంపుటి రచించాడు. అందులో హిందూ సంప్రదాయాలతో పాటు ఆనాటి సంస్కృత, తెలుగు పదాలు కనిపిస్తాయి. "పియా బాజే ప్యాలా.. పియా జాయేనా" అంటూ తొలి ఉర్దూ గజల్ ప్రక్రియకు నాంది పలికిన సాహితీ ప్రేమికుని ఊహల ప్రతిరూపమే కలల నగరం హైదరాబాద్. "హే అల్లా! సరస్సును చేపలతో నింపినట్లుగా నా నగరాన్ని ప్రజలతో పూరించు తండ్రీ!" అంటూ ప్రార్థించిన కులీకుతుబ్‌షా, నర్తకి భాగమతి ప్రణయ వృత్తాంతం చరిత్రలో భాగ్యనగరంతో ముడిపడి వుంది. కవిత్వాల సంపుటి 'కులియత్ కులీ'కాగా కలంపేరు 'మానీ'. నవాబ్ ఆస్థానంలోని, సారంగ తమ్మయ, వైజయంతీ విలాసం రచించాడు. ఎల్లారెడ్డి అనే కవి కిరాతార్జునీయం, బాలభారత కావ్యకర్త. ఆస్థానంలో మరొక కవి గణేష్ పండితుడు. సుల్తాన్ తెలుగు పద్య కవిగా తెలుగు, ఉర్దూ, పర్షియన్ భాషలలో ప్రావీణ్యుడు.

ఆయన పాలనా కాలంలో కొన్ని ఫర్మానాలు తెలుగులో కూడా జారీ అయిన చారిత్రక ఆధారాలున్నాయి. కుతుబ్ షాహీల పాలనా కాలంలో తెలుగు కవిత్వం సర్వతోముఖంగా అభివృద్ధి పొందింది. ఆ కాలంలోనే జటప్రోలు, గద్వాల వంటి సంస్థానాలు ఏర్పడి సంస్థానాధీశులు స్వయంగా కావ్యాలు రాయటమే కాక కవి పండితులను ఆదరించి కావ్య రచనలకు ప్రేరణ ఇచ్చారు.

కుతుబ్‌షాహీలు మత సామరస్యాన్ని పాటించారు. శ్రీకృష్ణ దేవరాయల మరణానంతరం విజయనగరంలోని అంతఃకలహాలను ఆసరా చేసుకొని తెలంగాణను క్రమేపీ కొండపల్లి, కంబంమెట్టు ఆఖరికి కృష్ణా గోదావరి ప్రాంతం



కూడా గోల్కొండ రాజ్యంలో విలీనమైంది. ఇబ్రహీం కుతుబ్‌షా(1550-1580 తన సోదరుడు జంషీద్ క్రూరత్వం కారణంగా విజయనగర సామ్రాజ్యంలో రాజ అతిథిగా తల దాచుకొన్నాడు. రామరాయలు రాజ్యంలో జాగీరు పొందాడు. అదే సమయంలో సామంతరాజు కుమార్తె భాగీరథిని పెళ్లి చేసుకొన్నాడు. సోదరుడు జంషీద్ మరణానంతరం 1550లో గోల్కొండ ప్రభువు కాగలిగాడు. భాగీరథి, ఇబ్రహీంల దాంపత్యం హిందూ కుతుబ్ షాహీ మత సామరస్యానికి నాంది అయింది. వారి మూడవ సంతానం మహమ్మద్ కులీ కుతుబ్‌షా, 14 యేళ్లకే గోల్కొండ రాజ్యపాలకునిగా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాడనటానికి ఆయన సాహిత్యమే సాక్ష్యం అయింది.

కూచిపూడి భాగవతులు అబుల్‌హసన్(తానీషా) కాలంలోనే కూచిపూడి గ్రామాన్ని మిరాశీగా(వంశ పారంపర్యం) పొందారు. కుతుబ్‌షాహీల పాలనా కాలంలోనే ఈరోజు హైదరాబాద్ నగర సాహితీ, నృత్య, సంగీత, సాంస్కృతిక మహోన్నతకు 'గంగా-జముని తెహ్‌జీబ్'గా మత సహనం, పరస్పర గౌరవ సమాదరణకు అంకురార్పణ అయిందని నగర చరిత్రకారుడు డా॥ మొహమ్మద్ సఫియుల్లా పేర్కొన్నారు.

– యర్రమిల్లి

# 11 జనవరి, 2026 నుండి 17 జనవరి, 2026 వరకు



## వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం కీలక వ్యవహారాలలో నిదానం అవసరం. కుటుంబ ఆరోగ్య సమస్యలు కాస్త చికాకు కలిగిస్తాయి. తెల్లజిల్లేడు వినాయకుని ప్రతిరోజు సిద్ధ గంధంతో పూజించడం చెప్పదగినది. ఋణాలు కొంత మేర తీర్చగలుగుతారు. గృహం వాహనాల కొనుగోలు యత్నాలు సాగిస్తారు. సంగీత, సాహిత్యాలపై దృష్టి సారిస్తారు. ప్రభుత్వ సంస్థల నుండి ఉత్తర్వులు ఆలస్యముగా అందుతాయి.

### వృషభం

ఈ వారం ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. పనులలో పురోగతి ప్రయత్న కార్య సిద్ధి లభిస్తుంది. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఋణబాధలు చాలా వరకు తీరతాయి. శత్రువులు ప్రయోజనాలను ఆశించి మీతో తాత్కాలిక మిత్రత్వానికి రాజీ యత్నాలను సాగిస్తారు. నిత్యం నాగసింధూరం ధరించండి.

### మిథునం

ఈ వారం కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పాత మిత్రుల ద్వారా కీలక సమాచారం అందుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ప్రముఖులు ముఖ్యమైన విషయాలపై ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. మాటల చాతుర్యంతో అందరిని ఆకట్టుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటి సాగుతాయి. షేర్ల విక్రయాలలో అధిక లాభాలు పొందుతారు. రి

### కర్కాటకం

ఈ వారం పనులలో విజయం సాధిస్తారు, ఇంటాబయటా అనుకూలంగా ఉంటుంది. దూరపు బంధువులను కలుసుకుని ఆనందంగా గడుపుతారు. రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడతాయి. పాత బాకీలు వసూలవుతాయి. ప్రత్యర్థులను మీ దారికి తెచ్చుకుంటారు. వ్యక్తిగత విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. చర్చలు ఫలిస్తాయి.

### సింహం

ఈ వారం సంఘంలో ఓ ప్రత్యేక గౌరవం పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. కోర్టుకేసులు పరిష్కారమవు తాయి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతారు. రాజకీయ, కళారంగాలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి. గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

### కన్య

ఈ వారం చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉల్లాసంగా గడుపుతారు. బంధువులనుండి కీలక సమాచారం అందుకుంటారు. మీ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సోదర వర్గానికి సహాయ సహకారాలు అందిస్తారు. భూములు, గృహం వాహనాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

### తుల

ఈ వారం కొత్త విషయాలు గ్రహిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. చర్చలలో పురోగతి కనిపిస్తుంది. మీ మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుని ముందుకు సాగుతారు. పెట్టుబడులో లాభాలు పొందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

### వృశ్చికం

ఈ వారం ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. పాత బాకీలు వసూలవుతాయి. మిత్రబృందంలోని ఒకరు మీతో శతృత్వం పెంచుకునే సూచనలున్నాయి. జీవితభాగస్వామి సలహాలను పాటిస్తారు. రెండు, మూడు విధాలుగా ఆశించిన కార్యక్రమాలను పురోభివృద్ధిలో నడిపించడానికి కావలసిన సహాయ సహకారాలు లభిస్తాయి. సంఘంలో గౌరవానికి లోటు ఉండదు.

### ధనస్సు

ఈ వారం కొన్ని అనుకూల ఫలితాలు సంభవం. వృత్తి-ఉద్యోగ వ్యాపా రములలో పూర్వము చేసిన ప్రయత్నములు సత్ఫలితాలనిస్తాయి. వ్యవసాయరంగంలో వారికి జాగ్రత్త అవసరం. కోర్టు వ్యవహారాలు, రాజకీయ వ్యవహారములు, లిటిగేషన్ వ్యవహారాలు, పెండింగ్లో ఉన్న రిజిస్ట్రేషన్ పనులు సానుకూల పడతాయి. దైవ సంబంధమైన కార్యములలో పాల్గొంటారు. నిత్యమూ అష్టమూలికా తైలంతో దీపారాధన చేయుట వలన మంచిది.

### మకరం

ఈ వారం స్త్రీ సంబంధమైన తగాదాలు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సంతాన విషయంలో మీరు ఆశించిన శుభ ఫలితాలు కనబడతాయి. ఈ వారంలో సాధ్యమైనంతవరకు ప్రయాణాలను వాయిదా వేయండి. భేదాభిప్రాయాలకు దూరంగా ఉండండి. కుటుంబంలోని వారి కోసం చేసే కొనుగోలు అంచనా లకు మించి ధనవ్యయం సూచిస్తోంది. అధిక శ్రమ, త్రిప్పుట ఎదురు కావచ్చు.


### కుంభం


ఈ వారం కార్యదక్షతను కనబరుస్తారు. అయితే మానసిక వత్తిడి అధికంగా ఉంటుంది. కోర్టు తీర్పులు అనుకూలమైన మలుపు తిరుగుతాయి. తమ స్వార్థాన్ని దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా మీతో స్నేహం నటిస్తున్నది ఎవరన్నది తెలుసుకోగలుగుతారు. మీ మనోభావాలను అర్థం చేసుకుని అధికార గణం వలన లాభపడతారు. కిందపడ్డా మీదే పై చేయి అన్నవిధంగా మొండిగా వ్యవహరిస్తారు. ధన వ్యయం అధికంగా ఉంటుంది.


### మీనం

ఈ వారం పనులు అప్రయత్నంగా పూర్తి కాగలవు. పెట్టుబడులకు తగిన సహాయం అందుకుంటారు. శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకొని ముందడుగు వేస్తారు. ఆర్థికపరమైన లావాదేవీలు ఆశాజ నకంగా ఉంటాయి. దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి. భాగస్వామ్య వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగాలలో చికాకులు తొలగుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

# ఈ వారం కార్టూన్స్


మీకేం తెలియదు.. అది కాదు.. వేరే ట్యాబ్లెట్ రాయండి..!!
డాక్టరు MD


నా దగ్గర మాంచి బ్రేకింగ్ న్యూస్ ఉంది.. అంట్ల మీరే తోముకుంటా అంటే చెబుతా..!


ఎంతసేపూ రాష్ట్రంలోనేనా తిరిగేది? బయట రాష్ట్రాలు చూడొద్దా? ట్రైన్స్‌లో కూడా ఫ్రీ ఉండాలి!!
STOP



అమెరికాలోని మోంటానాలో వున్న ఈ సరస్సులలో వివిధ రకాల రాళ్లున్నాయి.  ఈ పార్కును సరస్సుల నిలయం అని కూడా పిలుస్తారు.  ఈ పార్కులో సుమారు ఏడు వందల సరస్సులున్నాయి. ఒక్కో సరస్సులో ఒక్కో రంగు రాళ్లు వుండటం  విశేషం.







